దాచుకున్న సొమ్ముకూ.. దిక్కు లేదు!



- ఆపత్కాలంలో ఆదుకోని జీపీఎఫ్ నిధులు
- లోను పెట్టుకుని నెలలు గడిచినా దక్కని దుస్థితి
- వడ్డీలకు తెచ్చుకుని అప్పులపాలవుతున్న ఉద్యోగులు
- రెండేళ్లుగా సరండర్ లీవ్ బకాయిలు పెండింగ్
- మూడు డీఏ బకాయిలతో ఉద్యోగుల ఇక్కట్లు
- ఊసే లేని ఏపీజీఎల్ఐ వెబ్‌సైట్



గుంటూరు, జనవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు తమ భవిష్యత్ అవసరాల కోసం, భద్రత కోసం ఇన్సూరెన్స్, ప్రావిడెంట్ ఫండ్ రూపంలో నగదు దాచుకుంటారు. పండుగలు, శుభకార్యాలు, ఇతర అత్యవసరాలకు, ఆపత్కాల సమయంలో ఆ దాచుకున్న డబ్బులో నుంచి కొంత రుణం పొంది అవసరాలను నెట్టుకుపోవచ్చన్న కారణంగా ఉద్యోగులు కాస్త స్థిమితంగా ఉంటారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారి పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. ఉద్యోగులు దాచుకున్న గవర్నమెంట్ ప్రావిడెంట్ ఫండ్, ఉపాధ్యాయులు దాచుకున్న జెడ్పీ ప్రావిడెంట్ ఫండ్ నిధులను రూ.19వేల కోట్లను ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో ఉద్యోగులు దాచుకున్న సొమ్ముపై రుణాన్ని కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఉద్యోగులు రుణాలకు దరఖాస్తు చేసుకోవడమే తప్ప, ఆ రుణం ఎప్పుడు మంజూరవుతుందో కూడా తెలియని పరిస్థితి వారిది. దాదాపు తొమ్మిది నెలల క్రితం ఒక మారు రుణాలు మంజూరు చేసిన ప్రభుత్వం, ఆ తరువాత దరఖాస్తు చేసుకున్నవారికి రుణాలు మంజూరు చేయలేదు. దీంతో గడిచిన 9 నెలలుగా వారికి నిరీక్షణ తప్పలేదు. సుమారు వెయ్యిమంది ఉద్యోగులు జిల్లాలో రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉద్యోగుల నుంచి ఒత్తిడి పెరగడం, మరో మూడు నెలల్లో ఎన్నికలు వస్తుండడంతో కంటి తుడుపు చర్యగా ప్రభుత్వం నామమాత్రంగా కొందరికి రుణాలు మంజూరు చేసి మమ అనిపించింది. కాగా మెజారిటీ ఉద్యోగులు ఇప్పటికీ రుణాల కోసం ఎదురు చూస్తున్నారు.

3 డీఏలు పెండింగ్..

పీఆర్సీ జరిగిన తరువాత ఇప్పటికి 3 డీఏలు పెండింగులో వున్నాయి. తొలి డీఏకి సంబంధించి 18 నెలలు, రెండో డీఏకి సంబంధించి 12 నెలలు, మూడో డీఏకి సంబంధించి 6 నెలలుగా ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పీఆర్సీ పేరుతో అప్పటికే వున్న వేతనాలను తగ్గించిన ప్రభుత్వం డీఏలను బకాయి పెట్టడంతో ఉద్యోగులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. ఏడాదిన్నర కాలంగా డీఏ బకాయిలను చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వ తీరుపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డీఏ బకాయిలు విడుదల చేయకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

సెరెండర్ లీవ్స్ పరిస్థితి ఏంటి?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 30 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులకు ఏటా 30, ఉపాధ్యాయులకు ఏటా 6 ఎర్న్‌డ్ లీవ్స్ ఉంటాయి. వాటిని వినియోగించుకోని ఉద్యోగులు వాటిని ప్రభుత్వానికి సరండర్ చేసి వేతనాలు పొందుతారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అవీ ప్రశ్నార్థకంగా మారాయి. ఉద్యోగులు సెలవులైతే సెరండర్ చేస్తున్నారుగానీ ప్రభుత్వం వారికి చెల్లించాల్సిన వేతనాన్ని ఇవ్వడం లేదు. గడిచిన రెండేళ్లుగా ప్రభుత్వం వాటి ఊసే ఎత్తడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా 4వేల కోట్ల మేర సరండర్ లీవ్స్ బకాయిలు వున్నట్లు ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు చెబుతున్నారు. వాటి ని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

- గుంటూరు మండలానికి చెందిన ఒక ఉపాధ్యాయుడు తన పీఎఫ్ నుంచి రూ.13 లక్షలు రుణం కావాలని కిందటేడాది సెప్టెంబరులో దరఖాస్తు చేసుకున్నాడు. ఇప్పటి వరకూ ఆయన రుణానికి సంబంధించిన ఊసే లేదు. అక్టోబరులో ఆయన పదవీ విరమణ కూడా చేశాడు. అయినా సరే ఆయనకు రుణమూ రాలేదు. పీఎఫ్ నగదూ రాలేదు. ఇప్పటికీ ఆయన ఆ నగదు కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.
- మరో ప్రభుత్వ ఉద్యోగి ప్రాణాంతక ఆరోగ్య సమస్యకు గురై ఆసుపత్రి పాలయ్యాడు. అత్యవసర వైద్యం కోసం అతడికి రూ.6 లక్షలు అవసరమయ్యాయి. జీపీఎఫ్ ఉంది కదా అని దరఖాస్తు చేసుకున్నాడు. కానీ రుణం మాత్రం రాలేదు. దీంతో బయట అప్పు తెచ్చు కుని ప్రాణాలు నిలబెట్టుకోవాల్సి వచ్చింది.

- ఇలా ఒకటి కాదు.. రెండు కాదు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గడిచిన 9 నెలలుగా వందల సంఖ్యలో ఉద్యోగులు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

పత్తా లేని ఏపీజీఎల్ఐ..

ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే జీవిత బీమా(ఏపీజీఎల్ఐ) ఆచూకీ కూడా కనిపించడం లేదు. దాదాపుగా 9 నెలల నుంచి వందలాది క్లెయిములు పెండింగులో వున్నాయి. ప్రస్తుతం ఏపీజీఎల్ఐ వెబ్‌సైటు కూడా అందుబాటులో లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం మెయిన్‌టెన్స్ పేరుతో వెబ్‌సైటును నిలిపివేసిన ప్రభుత్వం ఆ తరువాత దాని ఊసు ఎత్తడమే మానేసింది. దీంతో ఇప్పటికే మెచ్యూర్ అయిన ఇన్సూరెన్స్ క్లెయిములు, ఇన్సూరెన్సుపై తీసుకునే రుణాల దరఖాస్తులు 9 నెలలుగా అలానే పడివున్నాయి.



- గుట్టుచప్పుడు కాకుండా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచేసిన ప్రభుత్వం
- మూడు నుంచి నాలుగు రెట్లు ఒకేసారి పెంపు
- 1955 హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టం సవరణ పేరుతో వడ్డింపులు
- రిజిస్ట్రార్ ఫీజు రూ.1,100 నుంచి రూ. 5,000 పెంపు
- స్లాట్ బుకింగ్‌కూ రూ.200 నుంచి రూ.500కి పెంపు
- 2023 డిసెంబర్‌లో కొత్త జీఓ జారీ

పెళ్లి నమోదైనా.. బాదుడే

హిందూ వివాహ చట్టాన్ని జనం అభిప్రాయాల మేరకు మార్పులు చేస్తున్నామంటూ... డిజిటలైజేషన్ పేరు చెప్పి వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులను ప్రభుత్వం ఒకేసారి నాలుగు రెట్లు పెంచేసింది. ఈ మేరకు గత ఏడాది డిసెంబర్ 22న 609 జీఓను గుట్టుచప్పుడు కాకుండా విడుదల చేసేసింది. ఆన్‌లైన్‌లో వివాహ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి, స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నవారు ఒకేసారి భారీగా ఫీజులు పెంచేసిన తీరుచూసి విస్తుపోతున్నారు. అదేమంటే వివాహ వేడుకలకు భారీగా ఖర్చు చేస్తున్నవారు ఆమాత్రం ఫీజులు కట్టలేరా అంటూ ప్రభుత్వ పెద్దలు సమర్థించుకోవడం విశేషం.

ఫీజులు పెంచేశారిలా..

చలానా ఫీజు రూ.200కు బదులు ఏకంగా ఒకేసారి రూ.500కు పెంచేశారు. దంపతులు అందించే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు గతంలో రూ.10 చెల్లిస్తే దానిని ఇప్పుడు రూ.100 చేశారు. రికార్డుల తనిఖీ వంటివాటికి కూడా గతంలో రూ.10, ప్రస్తుత సంవత్సరం కాకుండా ప్రతి గత సంవత్సరాలకు రూ.10 చొప్పున చెల్లించాల్సిఉండేది. కానీ ఇదికూడా రూ.100 చేసేశారు. వీటి పరిసితి ఇట్లా ఉంటే.. వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపానికో, గుడి దగ్గరకో రిజిస్ట్రార్ వచ్చి వివాహ రిజిస్ట్రేషన్ చేస్తే, దీనికి రిజిస్ట్రార్ ఫీరు రూ.1,100 చెల్లించాల్సి ఉండేది. దీనికి ఏకంగా రూ.5వేలకు పెంచేశారు. పైగా సెలవు రోజుల్లో రిజిస్ట్రేషన్ చెయ్యాలంటే మరో రూ.5,000 చెల్లించుకోవలసిందే. ఇది కేవలం రికార్డుల ప్రకారం అధికారిక చెల్లింపులు మాత్రమే.

తెనాలి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హిందూ వివాహ చట్టం 1955ను 1965లో ఒకసారి, మధ్యలో స్వల్ప సవరణలు చేసినా ఫీజులు మాత్రం గత ప్రభుత్వాలు పెంచనేలేదు. కానీ జగన్ సర్కారు వచ్చాక వరుస వడ్డనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అన్ని శాఖల తరహాలో వివాహ రిజిస్ట్రేషన్‌ల విభాగంపైనా ప్రభుత్వం కన్నుపడింది. గతంలోఉన్న ఫీజులను మాత్రమే మార్పులు చేస్తూ కొత్త జీఓను గత ఏడాది డిసెంబర్‌లో విడుదల చేసింది హిందూ వివాహాలు సాధారణంగా దేవాలయాల్లో, మండపాల్లో, లేక ఇళ్ల దగ్గర బంధువుల సమక్షంలో జరుపుకోవటం ఆనవాయితీ, మరికొందరు ఇటువంటి ఆడంబరాలు ఏమీ లేకుండా రిజిస్ట్రార్ సమక్షంలో సంబంధిత కార్యాలయంలోనే వివాహం చేసుకోవటం కూడా ఎప్పటి నుంచో ఉంది. బయట వివాహాలు చేసుకుని తమ వివాహాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవటం కూడా పరిపాటే. దీనికోసం గతంలో రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు రూ.200 చలానా తీయటం, దంపతులు అందించే ధ్రువీకరణ పత్రాల పరిశీలన, రికార్డుల పరిశీలన వంటి వాటికోసం రూ.50 వరకు చెల్లించటం జరిగేది. ఒకవేళ వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపం, లేక దేవాలయానికే రిజిస్ట్రార్ నేరుగా వచ్చి వివాహాన్ని రిజిస్టర్ చేయాలంటే రూ.1,100 రిజిస్ట్రార్ ఫీజు చెల్లించాల్సి ఉండేది. కానీ వీటన్నిటినీ ఇప్పుడు మూడు నుంచి పది రెట్ల వరకు పెంచేసింది ప్రభుత్వం.

అనధికార వసూళ్లు సరేసరి..

పాత ఫీజులున్నప్పుడే మధ్యవర్తులు వివాహ రిజిస్ట్రేషన్ చేయించినందుకు తమకు, సిబ్బంది లంచాలపేరు చెప్పి రూ.4వేలు వసూలు చేసేవారు. కానీ ఇప్పుడు ఫీజులే భారీగా పెంచేయటంతో ప్రస్తుతం రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు అనధికార వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ఫీజులన్నీ పెంచేయటంతో తాముకూడా దళారీ ఫీజులు పెంచేయాలనే ఆలోచనలో ఉన్నారని, అయితే జీఓ వచ్చి నెలరోజులు మాత్రమే కావటంతో ఎంత పెంచాలనే విషయంలో ఆలోచన చేస్తున్నారని సమాచారం. అంటే ప్రభుత్వం పెంచిన ఫీజులే భారీగా ఉంటే, అనధికారికంగా వసూళ్లు కూడా పెంచేస్తే కొత్త జంటలకు వివాహ చట్టభద్రత ఇక భారమే అయ్యే పరిస్థితి.

డిజిటలైజేషన్ పేరుతో బాదుడే...

హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టాన్ని మార్పులు చేస్తున్నట్లు 609 జీఓలో పేర్కొన్న ప్రభుత్వం డిజిటలైజేషన్‌కు సంబంధించి మార్పులు మాత్రం పెద్దగా ఏమీచేయలేదు. ఇప్పుడు డిజిటల్ ధ్రువీకరణ పత్రాలు వచ్చినా, ఇంకా నకళ్లు అడుగుతుండటం విశేషం, ఫారం-ఎ గతంలోనూ అందించాల్సి ఉండేది. అయితే ఇప్పుడు స్లాట్ బుక్ చేసుకున్నాక ఫారం-ఎను ఆన్‌లైన్‌లో నింపటం ఒక్కటే కాకుండా, డౌన్‌లోడ్ చేసి, మళ్లీ వాటికి ఇతర ధ్రువపత్రాలను జతచేసి ఇవ్వాల్సిన పరిస్థితి. మరో విశేషమేమంటే... హిందూ వివాహ చట్టం రూల్స్ మార్చేందుకు ఒక కమిటీని వేశామని, ఆ కమిటీ ముందు జనం వివరించిన అభిప్రాయాలు, వారి సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్ట సవరణ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. అయితే జనాభిప్రాయంలో ఎవరూ ఫీజుల పెంపు సూచనలు చేయటం వాస్తవ విరుద్ధమే.

మరో మారు మోసం

- జగన్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు
- వరికపూడిశెల పరిశీలనలో జీవీ, బ్రహ్మారెడ్డి

వెల్దుర్తి, జనవరి 21: ఎన్నికల ముందు పల్నాడు ప్రజలను మరోమారు మోసం చేసేందుకే వరికపూడిశెలకు వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, అఖిలపక్ష పార్టీల నేతలతో కలిసి వరికపూడిశెల ప్రాంతాన్ని పరిశీలించి నిరసన తెలిపారు. టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన రూ.344 కోట్లను కూడా ఖర్చు చేయకుండా అనుమతులంటూ పనులు ప్రారంభించకుండా కాలయాపన చేశారన్నారు. చంద్రబాబునాయుడు తీసుకొచ్చిన నిధులు ఖర్చు చేసుంటే ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగేవన్నారు. గోదావరి, పెన్నా నదుల అనుసంధానం చేసి 2 లక్షల ఎకరాలకు సాగు నీరందించేందుకు చంద్రబాబునాయుడు రూ.5,400 కోట్లు మంజూరు చేస్తే ఆ నిధులను కూడా నీరు గార్చారన్నారు. 611 గ్రామాలకు పల్నాడు వాటర్ గ్రిడ్ ద్వారా మంచినీటిని అందించేందుకు చంద్రబాబు నిధులు మంజూరు చేశారన్నారు. కనీసం జిల్లా మంత్రి అంబటి రాంబాబు కూడా ఈ ప్రాంతాభివృద్ధిపై దృష్టి సారించలేదన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌ను 71 శాతం పూర్తి చేస్తే వైసీపీ ప్రభుత్వం నీరు గార్చిందన్నారు. ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించిన చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే వరికపూడిశెల సాకారమవుతుందని అన్నారు. దీన్ని సాధించే బాధ్యతను ఈ ప్రాంత నాయకులుగా తాను, బ్రహ్మారెడ్డి, ఎరిక్సన్‌బాబు తీసుకుంటామన్నారు. వరికపూడిశెల ప్రాజెక్ట్‌తోపాటు పల్నాడు వాటర్‌గ్రిడ్ పథకాలపై యువగళం పాదయాత్రలో యువ నాయకుడు నారా లోకేశ్ ఇచ్చిన హామీని గుర్తు చేశారు. తప్పకుండా ఈ పథకాలను పూర్తి చేస్తామని హామీనిచ్చారు.



వరికపూడిశెల ప్రాజెక్ట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి

ఇది దగా కాదా జగన్: బ్రహ్మారెడ్డి

ఎన్నికలకు ఆరు నెలల ముందు టెంకాయ కొడితే దగా, మోసం అని.. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లో టెంకాయ కొడితే చిత్తశుద్ధి అని చెప్పావు కదా జగన్ మోహన్‌రెడ్డి.. ఎన్నికలకు నాలుగు నెలల ముందుకు వరికపూడిశెలకు శంకుస్థాపన చేయడం మోసం, దగా కాదా అని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. ఎన్నికలకు ముందు స్థానిక ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వరికపూడిశెల పూర్తి చేసి నీరు అందించిన తరువాతే ఓట్లు అడుగుతానని చెప్పి ఇప్పుడు వరికపూడిశెలకు శంకుస్థాపన చేసి ఓట్లు అడుగుతాననడం ప్రజలను మోసం చేయడం కాదా అన్నారు. గతంలో అటవీ అనుమతులు కఠినంగా ఉండేవని, తన తల్లి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కొంతమేర అయినా మేలు జరగాలనే ఉద్దేశంతో అప్పటి ప్రధాని వాజ్‌పేయి దృష్టికి ఈ ప్రాంత సమస్యను తీసుకెళ్లగా జెర్రివాగు పథకం తీసుకొచ్చి పూర్తి చేశామని అన్నారు. రానున్న ఎన్నికల్లో గెలిచేది టీడీపీ ప్రభుత్వమేనని, పథకాలన్నీ పూర్తవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జి ఎరిక్సన్‌బాబు, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, నేరేటి వీరాస్వామి, పట్టణ కొమెర దుర్గారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రంనాయక్, నర్రా గురవారెడ్డి, వరికపూడిశెల సాధన సమితి సభ్యుడు మూర్తి, సీపీఐ ఏరియా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ముండ్లమూడి కోటయ్య, కృష్ణమూర్తి, పంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జీవీ ఆంజనేయులు, బ్రహ్మారెడ్డి తదితరులు

తాగునీరు.. వృధా

- పైపు లైన్‌పై లీకులు
- చోద్యం చూస్తున్న పురపాలకులు

నరసరావుపేట, జనవరి 21: పైపులైన్‌పై ఏర్పడిన లీకులతో రక్షిత నీరు వృధాతో పాటు కలుషితం అవుతోంది. శాంతినగర్ వద్ద ఉన్న నీటి శుద్ధి ప్లాంటు నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా అయ్యే పైపు లైన్‌లపై లీకులు ఏర్పడ్డాయి. దాదాపు 20కి పైగా లీకులు ఉన్నట్లు గుర్తించారు. వీటిని అరికట్టడంలో మునిసిపల్ నీటి విభాగం చోద్యం చూస్తోంది. నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. రోజుకు ఒక పూట తాగునీటిని సరఫరా చేస్తున్నారు. నీటి సరఫరాలో 10 నుంచి 20 శాతం వరకు నీరు వృధా అవుతున్నట్లు అంచనాగా ఉంది. చెరువుల్లో ఉన్న నీటిని లీకుల ద్వారా వృధా చేస్తే నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. లీకుల వలన నీరు కలుషితం అవుతున్నా చర్యలు తీసుకోక పోవడం ప్రజారోగ్యంపై మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. ఇప్పటికైనా లీకులను నిరోధించి నీటి వృధాను అరికట్టే ప్రయత్నం అధికారులు చేస్తారో లేదో చూడాలి.



పల్నాడు రోడ్డులో పైపులైన్ లీకులు



ప్రభుత్వ భూములు.. పరాధీనం

- పల్నాడులో ప్రభుత్వ భూములకు రెక్కలు
- గతంలోనే ఆన్‌లైన్‌లో నమోదు
- ఇప్పుడు పట్టాదారు పాస్‌పుస్తకాలకు దరఖాస్తులు

పిడుగురాళ్ల, జనవరి 21: రెవెన్యూ డివిజనల్ కార్యాలయానికి అతి తక్కువ దూరంలోనే ఉన్న పొందుగల గ్రామంలో ప్రభుత్వ భూములకు కొందరు అధికార పార్టీ నేతలు హక్కుదారులు అవుతున్నారు. రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకురావడంతో పాటు అమ్యామ్యాలు చేతులు మారడంతో పల్నాడులో ప్రభుత్వ భూములు కొందరు నేతల పరాధీనమయ్యాయి. గురజాల నియోజకవర్గంలో గడచిన నాలుగేళ్లుగా పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల, మాచవరం మండలాల్లో వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు అధికారమే అండగా వున్న కొందరు నేతలు, వారి అనుయాయుల పేర్లతో రెవెన్యూ రికార్డులు మారిపోయాయి. వందల ఏళ్లుగా ప్రభుత్వ భూమిగా వున్న పొందుగల సమీపంలోని వందలాది ఎకరాల భూములు కొందరు నేతలు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవడమే కాకుండా బ్యాంకుల్లో రుణాలు సైతం పొందేశారు. ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తరలించుకుపోవడమే కాకుండా భూములను సైతం తమ చేతుల్లోకి తీసుకుంటున్నా రెవెన్యూ అధికారులు కూడా వారికే సహకరిస్తున్నారు. దాచేపల్లి మండలం పొందుగల, తంగెడలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు అధికార పార్టీ అండ వున్న కొందరు నేతలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. మాచవరం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు పరిధిలోకి వచ్చిన కొన్ని గ్రామాల్లో కొన్ని ఎకరాలు ప్రాజెక్టు ముంపునకు గురికాగా ప్రభుత్వం పరిహారం పొందిన భూములను సైతం కొందరు నేతలు వదలకుండా తమ పేర్లతో ఆన్‌లైన్‌లో పేర్లు మార్పు చేసుకున్నారు. అనంతరం బ్యాంక్‌లో రుణాలు పొందారు. పిడుగురాళ్లలో కూడా ప్రధాన రహదారి సమీపంలో వున్న ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు సైతం కొందరు రెవెన్యూ అధికారులు పలువురు నేతలు చెప్పిన వారికే రికార్డుల్లో ఎక్కించారు. గురజాలలో దైద, గొట్టిముక్కల సమీపాల్లో వున్న ప్రభుత్వ భూముల్లో అక్రమ గ్రావెలింగ్ చేయడమే కాకుండా కొంత భూమిని కూడా తమ పేర్లతో నమోదు చేసుకున్నారు. దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల మండలాల్లో గతంలో పనిచేసి బదిలీ అయిన కొందరు తహసీల్దార్లు అధికార పార్టీ నేతలు తానా అంటే తందాన అంటూ వత్తాసు పలుకుతూ విలువైన భూములను సైతం వారిపేర్లతో రాసిచ్చారు.



పొందుగల వద్ద ప్రభుత్వ భూమి

పిడుగురాళ్లలో అయితే గతంలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఓ తహసీల్దార్ ఏకంగా అనుభవదారు సర్టిఫికెట్‌తో పాటు రెవెన్యూ రికార్డుల్లో సైతం కొందరి పేర్లు నమోదు చేసి దండిగా డబ్బులు దండుకున్నారు. దాచేపల్లిలో ఇదే తరహాలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వంలో అధికార పార్టీ నేతల మధ్య వర్గపోరుతో కొందరు తహసీల్దార్లు తరచూ బదిలీలు అవుతున్నారు. గత నాలుగేళ్లుగా ఎక్కడ భూములు ఖాళీ వుంటే అక్కడ తమ పేర్లు నమోదు చేసుకున్న వారందరూ ఇప్పుడు మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారుల చుట్టూ పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందేందుకు తిరుగుతున్నారు.

బదిలీ అయితే ఏముందిలే...

గత రెండున్నరేళ్లుగా తహసీల్దార్లుగా ఉన్న కొందరు అధికారులు అధికార పార్టీ నేతలు చెప్పిన పనులన్నీ తూచ తప్పకుండా అమలు చేశారు. ఇప్పటిదాకా గురజాల నియోజకవర్గంలోని పలు మండలాల్లో వందల ఎకరాల ప్రభుత్వ భూముల రికార్డులు సైతం మార్చివేసి కొందరు వ్యక్తుల పేర్లను నమోదు చేశారు. వాటిపై రుణాలు పొందిన వారందరూ ఇప్పుడు ఆ భూములపై మరింత హక్కు పొందేందుకు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్నికల వేళ కొద్దిరోజుల్లో బదిలీ కాబోతున్న రెవెన్యూ అధికారులతో ఇప్పటిదాకా తమ పేర్లతో నమోదైన ప్రభుత్వ భూములకు పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందేందుకు రెవెన్యూ అధికారులపై ఒత్తిళ్లు తీసుకొస్తున్నారు. ఇంత చేసినా తమకు ఈ కాస్త పని చేసిపెడితే ఏమవుతుందిలే.. ఎటూ కొద్దిరోజుల్లో బదిలీ అయిపోయి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు వెళ్తాం కదా అన్న ధీమాతో కొందరు అధికారులు అక్రమమార్గంలో రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసిన వారి పేర్లతో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చేందుకు తగిన సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

దిక్సూచి
DIKSUCHI



రీజనింగ్

లెటర్ సిరీస్

పోటీపరీక్షల ప్రత్యేకం

పార్ట్-1

1. PQR/ RPQ/ QRP/ PQR

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో రెండో , మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి.. అదేవిధంగా రెండో సమూహంలో చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో రెండో, మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

2. PQ/ PPQ/ PPPQ/ PPPPQ

మొదటి సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'P' అదనంగా వస్తున్నది.

3. abcd/ aabbccdd/ aaabbbccc

మొదటి సమూహంలో ఒక abcd, రెండో సమూహంలో రెండు aలు, రెండు bలు, రెండు cలు, రెండు dలు ఒక సమూహంగా ఏర్పడింది. మూడో సమూహంలో మూడు aలు, మూడు bలు, మూడు cల వరకు ఈ సిరీస్ ఏర్పడింది.

4. baac/ accb/ cbba/ baac/ accb

మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా, రెండో అక్షరమే మరల మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడ్డాయి. అదేవిధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలోని ఒకటో, రెండవ అక్షరాలుగా, రెండో అక్షరమే తిరిగి మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడింది. ఈవిధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

5. ccacc/ aabaa/ bbcbb/ ccacc

మొదటి సమూహంలో నాలుగు cలు, రెండో సమూహంలో నాలుగు aలు, మూడో సమూహంలో నాలుగు bలు ఏర్పడుతూ మొదటి సమూహంలోని నాలుగు అక్షరాలకు మధ్యగా a. రెండో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా b, మూడో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా c. ఈవిధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

6. PQR/ QRST/ RSTUV/ STUVWX

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాలను(ఆల్ఫాబెట్స్) అనుసరిస్తూ ఏర్పడ్డాయి. రెండో సమూహంలోని చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలోని మొదటి మూడు అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడినవి. అదేవిధంగా మూడో సమూహంలోని చివరి నాలుగు అక్షరాలు నాలుగో సమూహంలో మొదటి నాలుగు అక్షరాలుగా ఏర్పడుతూ అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

7. aabc/ bbca/ ccab/ aabc

పై సిరీస్‌లో అండర్‌లైన్ చేసిన అక్షరాలు abc/ bca/ cab/ abc-లకు 11వ మోడల్‌కు సంబంధించిన వివరణే. అంతేకాక ప్రతి సమూహంలోను మొదటి అక్షరమే రెండుసార్లు రిపీట్ అయినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

అదానీ Vs హిండెన్‌బర్గ్
ఆరోపణలు - పరిణామాలు



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

భారతదేశం తొంభయ్యవ దశకంలో చేపట్టిన సంస్కరణలతో ఆర్థికరంగం సరికొత్త రూపుదాల్చింది. ఎల్‌పీజీ(లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్)ను ప్రవేశపెట్టడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థలో వృద్ధితోపాటు, కొన్ని అవలక్షణాలకు ద్వారాలు తెరిచినట్లయింది. మరీ ముఖ్యంగా వైట్‌కాలర్ నేరాలు(స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లు, మనీ లాండరింగ్, డొల్ల సంస్థలు, పన్ను ఎగవేతలు, రుణాల కుంభకోణాలు మొదలైన ఆర్థిక నేరాలు) విజృంభించాయి.

కొత్తగా అనుసరిస్తున్న ఆర్థికపంథాకు అవసరమైన నియంత్రణ సంస్థల, చట్టాలపరమైన కొరతకు తోడు ఇతర దేశాలతో ఆర్థిక నేరాల సమాచార మార్పిడి, నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు విస్తృతంగా లేనందున ఆర్థిక నేరాలను పసిగట్టడం, అదుపు చేయడం, నేరగాళ్లను శిక్షించడంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల తరచూ ఏదో ఒక తరహా వైట్ కాలర్ నేరాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

ఇటీవల అదానీ గ్రూప్ సంస్థలపై అలాంటి వైట్‌కాలర్ నేరాలను ఆరోపిస్తూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్, ఆర్థిక నేరాల పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఒక పరిశోధన నివేదికను జనవరి 2023లో విడుదల చేసింది.

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు

1. అదానీ గ్రూపునకు చెందిన పోర్ట్స్, లాజిస్టిక్, పవర్ జనరేషన్, అగ్రి బిజినెస్ వంటి వివిధ సంస్థలు స్టాక్ మార్కెట్ మ్యానిప్యులేషన్, అకౌంటింగ్ లోసుగులు, పన్ను ఎగవేతలు, ఫ్రాడ్ స్కీమ్‌లు వంటి చర్యల ద్వారా దశబ్దాల తరబడి సుమారు 17.8 ట్రిలియన్ల(218 బిలియన్ డాలర్ల) మేర అక్రమాలకు పాల్పడ్డాయి.
2. అదానీ కుటుంబ సభ్యులు మారిషస్, కరేబియన్ దీవులు, యుఏఈ వంటి టాక్స్‌హెవెన్(పన్ను రాయితీ/పన్నురహిత) దేశాల్లో షెల్ కంపెనీలు(డొల్ల కంపెనీలు) ఏర్పాటుచేసి అనేక అక్రమాలకు తెరలేపారు.
3. ఈ డొల్ల కంపెనీల ద్వారా భారీఎత్తున మనీ లాండరింగ్, అవినీతి, స్వదేశంలో పన్ను ఎగవేత జరిగాయి.
4. అదానీ గ్రూపులోని పబ్లిక్ లిస్టింగ్ కంపెనీల మధ్య నిధుల అక్రమ బదిలీ ఈ డొల్ల కంపెనీల ద్వారా జరిగింది.
5. షేర్ల విలువను తప్పుడు మార్గా ల్లో పెంచడం ద్వారా బ్యాంకుల నుంచి భారీఎత్తున రుణాలు, ఇతర సంస్థల నుంచి పెట్టుబడులు అదానీ పొందారు.

షార్ట్ సెల్లింగ్ అంటే ఏమిటి?

హిండెన్‌బర్గ్ సంస్థ షార్ట్ సెల్లింగ్‌కు పాల్పడేందుకే అదానీ గ్రూపు లొసుగులపై నివేదికను వెలువరించిందనే వాదనలూ ఉన్నాయి. షార్ట్ సెల్లింగ్ అంటే సాధారణంగా స్టాక్ మార్కెట్లలో సాధారణ ఇన్వెస్టర్లు, భవిష్యత్తులో షేర్ ధర పెరగవచ్చనే ఆశావాద దృక్పథంతో చేసే కొనుగోళ్లకు పూర్తిగా విభిన్నం అయిన ప్రక్రియ ఇది. ఒక ప్రయోజనంతో, ధరలు ఎక్కువగా ఉన్నప్పుడే అరువుగా ఆ షేర్లను తీసుకుంటారు. వాటిని అమ్మి, ఆ మొత్తంతో ధర పడిపోగానే భారీగా ఆ షేర్లు తిరిగి కొంటారు. ధర పెరిగినప్పుడు మరలా అమ్మి, లభించిన మార్జిన్‌తో భారీగా లాభపడతారు. అలా అరువు తీసుకున్న షేర్లను తిరిగి వెనక్కి ఇచ్చేసే ప్రక్రియ ఇది. దీనిలో తక్కువ కాలానికి స్టాక్స్ ఉంచుకుంటారు.

19(ఎ) రూల్ అనగా?

'సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(రెగ్యులేషన్) రూల్స్ 1957'లోని 19(ఎ) రూల్ ప్రకారం భారత స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ప్రతి కంపెనీ కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను కలిగి ఉండాలి. అంటే 75 శాతం మించి కంపెనీ యజమానులు కానీ వారి కుటుంబీకులు కానీ వాటాను కలిగి ఉండరాదు. ఈ నియమం ఇన్‌సైడర్ ట్రేడింగ్, షేరు ధరల్లో అవకతవకలకు పాల్పడటం వంటి వాటిని నిరోధించడానికి నిర్దేశించారు. షేర్ మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో కొంతమొత్తం షేర్లు ఉంచడం ద్వారా ట్రేడింగ్ జరిగి షేర్ విలువల్లో కచ్చితత్వ సాధనకూ ఈ నియమాన్ని ప్రవేశపెట్టారు.

ఈ నివేదిక వెలువడటంతోనే దేశంలోనే సంపన్న వ్యక్తిగా నిలిచిన గౌతం అదానీ సంస్థల షేర్లు గత ఏడాది 150 బిలియన్ డాలర్ల మేర నష్టపోవడానికి, అతని వ్యక్తిగత సంపద 60 బిలియన్ డాలర్ల మేర తుడిచిపెట్టుకుపోవడానికి కారణమైంది. ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. అదానీ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలిచ్చిన బ్యాంకులు, పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ సంస్థ షేర్లు అమాంతం పడిపోయాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా మూలధన మార్కెట్ రెగ్యులేటింగ్ ఏజెన్సీ అయిన 'సెబీ(సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)'ను 2023 మార్చిలో ఆదేశించింది. ఈ మేరకు సెబీకి సుప్రీంకోర్టు రెండు కీలక విషయాల పరంగా పరిశోధన జరపాలని టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చింది. **అవి–**

1. సెక్యూరిటీస్ కాంట్రాక్ట్(రెగ్యులేషన్)రూల్స్ 1957లోని రూల్ 19(ఎ)ను అదానీ గ్రూపు సంస్థలు అతిక్రమించాయా?
2. స్టాక్ ప్రైసెస్ అవకతవకలు, అదానీ సంస్థల్లో రహస్య లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై పరిశీలన.

దీనితోపాటు సుప్రీంకోర్టు కూడా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏ.ఎం.సప్రే అధ్యక్షతన ఆరుగురు సభ్యుల ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించి హిండెన్‌బర్గ్ రిపోర్టు తో ఇన్వెస్టర్లు సంపద కోల్పోవడానికి రెగ్యులేటరీ వైఫల్యం ఎంత ఉందో చెప్పాల్సిందిగా ఆదేశించింది.

ఈ క్రమంలో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేపుతూ ఫైనాన్షియల్ టైమ్స్, ద గార్డియన్ పత్రికల్లో ఆగస్టులో 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ) వెలువరించిన రిపో ర్టు సంచలనం రేపింది. ఈ సంస్థ రిపోర్టు, హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాలను చూపెట్టింది. విదేశాల్లోని డొల్ల కంపెనీల ద్వారా ఏవిధంగా అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్స్‌లో రూల్ 19(ఎ)ను అతిక్రమిస్తూ రహస్యంగా 75 శాతానికి మించి వాటాను అదానీ కుటుంబం సంపాదించిందో అంతర్గత ఈమెయిల్స్, ఇన్వాయిస్‌లు, లావాదేవీల రికార్డులు సహితంగా ఆధారాలు ప్రచురించింది. అంతేకాక గతంలో అదానీ కంపెనీ జరిపిన కొన్ని అనుమానాస్పద లావాదేవీలను సెబీ నియంత్రణ చేయలేకపోవడం గతంలో సెబీ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి తదుపరి అదానీ గ్రూపు కొనుగోలు చేసిన ఎన్‌డీటీవీలో కీలక పదవి చేపట్టడం వంటి విషయాలు సైతం ఈ నివేదిక వెల్లడించింది. ఈ వార్తా కథనాలతో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేకెత్తించడంతో కొందరు అదానీ కేసులో సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) లేదా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు.ఈ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం జనవరి 3న తీర్పు చెప్పింది.

సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలు

1. సెబీ చేస్తున్న దర్యాప్తుపై ఎటువంటి అనుమానాలూ లేవని, అదనంగా సిట్‌ను గానీ, సీబీఐని గానీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సెబీ సమగ్రతను శంకించలేమని పేర్కొంది.
2. ఇప్పటికీ విచారణ చేపట్టాల్సిన 22 అంశాల్లో 20 అంశాలపరంగా విచారణ పూర్తయిందని సెబీ తెలిపిన దరిమిలా మిగతా రెండు అంశాలపై కూడా మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది.
3. పిటిషన్‌దారులు కోరినట్లుగా, సెబీ ఇటీవల ప్రవేశపెట్టిన ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ రెగ్యులేషన్, ద లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్స్ రిక్వైర్‌మెంట్ రెగ్యులేషన్ పరంగా ఎటువంటి మార్పులు చేయాలని సెబీని ఆదేశించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.
4. హిండెన్‌బర్గ్ సంస్థ నివేదిక వెలువరించిన తరవాత భారత షేర్ మార్కెట్‌లో ఒడుదొడుకులను ఆసరాగా చేసుకొని షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ భారీగా కొనుగోళ్లు జరిపి లాభపడిందనే వార్తలు వచ్చాయి. ఆ నేపథ్యంలో, హిండెన్‌బర్గ్ అవకతవకలకు పాల్పడిందేమో విచారించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది. అయితే కొందరు విశ్లేషకులు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు విషయంలో కొన్ని అంశాలపరంగా మరింత స్పష్టత ఆశిస్తున్నారు. **అవి–**

- సెబీ దర్యాప్తు పూర్తిచేసిన 20 అంశాల్లో ఏముందో ప్రజలకు గానీ, కనీసం సుప్రీంకోర్టు పరిశీలించడానికి గానీ సెబీ నివేదించలేదు. సుప్రీంకోర్టు కూడా వాటి వివరాలు కోరలేదు.
- దర్యాప్తు పూర్తిచేయాల్సి ఉన్న మిగతా రెండు విషయాలైన రూల్19(ఎ) అతిక్రమణకు సంబంధించి, అదానీ సంస్థ ల్లో పెట్టుబడి పెట్టిన విదేశీ సంస్థల యాజమాన్యాలు, వాటి లావాదేవీల గురించి హిండెన్‌బర్గ్ ఓసీసీఆర్‌పీ సేకరించిన వివరాలు, ఆధారాలు సెబీ ఎందుకు సేకరించలేకపోతోంది?
- టాక్స్ హెవెన్ దేశాల్లో ఆర్థిక సంబంధమైన సమాచార మార్పిడిపరంగా ఉన్న నిబంధనల కారణంగా మిగిలిన రెండు అంశాల్లో విచారణ ఆలస్యమవుతోందని సెబీ కోర్టుకు తెలిపింది. అయితే ఆ సమస్య పరిష్కార దిశగా సెబీ, సుప్రీంకోర్టు, ప్రభుత్వం ఎలాంటి పరిష్కార మార్గాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు చూపకపోవడంతో కేసు విచారణ మూడు నెలల గడువులోగా పూర్తికావడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి.
- సెబీ దర్యాప్తు ఆలస్యం అవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమం కావడంలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విధిని నిర్వర్తించేందుకు సెబీ కనీసం ప్రాథమిక దర్యాప్తు నివేదికనైనా బహిర్గతపరచాల్సి ఉంటుంది. నేరారోపణ ఉన్నట్లయితే మిగతా రెండు విషయాల కోసం కాలయాపన తగదు.

గతంలో ఇదేతరహా ఆర్థిక నేరాలకుగాను 15 సంవత్సరాల క్రితం సెబీ అదానీపై ఫిర్యాదు నమోదుచేసి, పదిలక్షల జరిమానా విధించింది. ప్రస్తుతం వివిధ బ్యాంకులు అదానీకి భారీగా రుణాలు ఇచ్చి ఉండటం, ఎల్ఐసీ అదానీ సంస్థల్లో 81,347 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టి ఉన్న నేపథ్యంలో ఒకవేళ నేరాలు రుజువై, అదానీ రుణాల చెల్లింపులో విఫలమైతే స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒడుదొడుకులు నమోదవుతాయన్న భయాలు సర్వత్రా నెలకొన్నాయి.

అయితే ఈ తీర్పుతో సెబీ సమగ్రతపై సుప్రీంకోర్టు ధృవీకరణ ఇచ్చినట్లయింది. భారతదేశ విత్త మార్కెట్, రెగ్యులేటరీ మెకానిజాలపై ఇన్వెస్టర్లకు అభద్రతాభావం కలుగకుండా ఉండేందుకు ఇది దోహదపడింది.

ఇదిలా ఉండగా తీర్పు వెలువడిన వెంటనే గౌతమ్ అదానీ 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేయడం మాత్రం కేసులో ఆయన విజయం సాధించినట్లుగా భ్రమలు కల్పించే ప్రయత్నమేనని విమర్శకులు పేర్కొంటున్నారు. నిజానికి సెబీ కానీ, సుప్రీంకోర్టు కానీ ఆయనకు ఎటువంటి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. కేవలం సెబీ సమగ్రతకు మాత్రమే సుప్రీంకోర్టు ధృవీకరణ దక్కింది. ●



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

బొత్స ఇంటిని ముట్టడిస్తాం

▸▸ నిరుద్యోగ జేఏసీ

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'మెగా డీఎస్సీ అంటూ వైసీపీ ప్రభుత్వం పదే పదే నిరుద్యోగులను మోసం చేస్తోంది. సంక్రాంతి పండగ తర్వాత నోటిఫికేషన్ ఇస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటన చేశారు. అతరువాత కనీస స్పందన లేదు' అని జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ ఓ ప్రకటనలో మండిపడ్డారు. 'నిరుద్యోగులు చేస్తున్న ఒత్తిడితో మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి ఏర్పడింది. వారిని మభ్యపెట్టడానికి ఉత్తుత్తి ప్రకటనలు చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకపోతే త్వరలో మంత్రి బొత్స ఇంటిని ముట్టడిస్తామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను రోడ్లపై తిరగనివ్వం' అని సిద్ధిక్ హెచ్చరించారు.

రాజకీయాలకతీతంగా పనిచేస్తాం

▸▸ ఇంజనీరింగ్ కాలేజీల సంఘం

అమరావతి, జనవరి 21(ఆంధ్రజ్యోతి): 'రాజకీయ పార్టీలతో సంబంధం లేని వారిని సంఘం నేతలుగా ఎన్నుకోవడం ద్వారా సాంకేతిక కాలేజీల అభివృద్ధి జరుగుతుంది. విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి' అని ఏపీ ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం పేర్కొంది. నూతనంగా ఎన్నికైన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి పెద్దిరెడ్డి మధుసూదన్‌రావు, కోశాధికారి గ్రంధి సత్యనారాయణ ఆదివారం విజయవాడలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మొదటి సమావేశం నిర్వహించి పలు తీర్మానాలు చేశారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న కళాశాలలు ఇతర కాలేజీలకు తోడ్పాటు ఇవ్వాలని, ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్‌తో సమన్వయం చేసుకుని కాలేజీలు ఆర్థికంగా మెరుగుపడేలా చూడాలని తీర్మానించినట్లు నేతలు తెలిపారు.

కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో నక్కపల్లి పోలీసులు

నక్కపల్లి (అనకాపల్లి జిల్లా), జనవరి 21: కారులో తరలిస్తున్న రూ.2.07 కోట్ల నగదును అనకాపల్లి జిల్లా నక్కపల్లి పోలీసులు పట్టుకున్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. ఎస్ఐ విభీషణరావు ఆదివారం విలేకర్లకు వెల్లడించిన వివరాల మేరకు.. అనకాపల్లి జిల్లా ఎస్పీ, నర్సీపట్నం ఏఎస్పీ ఆదేశాలతోపాటు అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో నక్కపల్లి పోలీసులు శనివారం రాత్రి జాతీయ రహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న కారును ఆపి పరిశీలించారు. లోపల ఇద్దరు వ్యక్తులతోపాటు ఐదు బ్యాగులు కనిపించడంతో ఆ బ్యాగులను తెరిచి చూడగా పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. తాము ధాన్యం వ్యాపారులమని, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నుంచి నగదు తీసుకెళుతున్నామని కారులో ఉన్న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన వజ్రపు వెంకటేశ్వరరావు, యాదవ రాజు బదులిచ్చారు. అయితే ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు బ్యాగుల్లోని రూ.2.07 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు సోమవారం అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

29 నుంచి ఈఆర్సీ ప్రజాభిప్రాయ సేకరణ

విజయవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలో వచ్చే వార్షిక నివేదికపై ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు సీపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ సూర్యారావుపేటలోని సీపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఈ అభిప్రాయ సేకరణ ఉంటుందని తెలిపారు.



సీన్ మారుతోంది!

▸▸ రుతుపవనాలపై వాతావరణ మార్పు ప్రభావం

▸▸ దేశంలో 55 % తాలూకాల్లో 10 % పెరిగిన వర్షపాతం

▸▸ గంగా మైదానం, ఈశాన్య భారతంలో వర్షాభావం

▸▸ ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడు, తెలంగాణ, ఏపీలో మూడు జిల్లాల్లో పెరిగిన వర్షాలు

▸▸ వాతావరణ, పర్యావరణ నిపుణుల అధ్యయనంలో వెల్లడి



గత ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావం వల్ల ఎండిపోయిన వరి పైరు

డిసెంబరులో సంభవించిన మిచౌంగ్ తుఫాన్ వర్షాలతో నీటిపై తేలుతున్న వరి పనలు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 'వాతావరణ మార్పు ప్రభావం' (క్లైమేట్ చేంజ్ ఎఫెక్ట్)తో వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆకస్మికంగా కుంభవృష్టి వర్షాలు, వరదలు.. ఇదే సమయంలో తీవ్రమైన వర్షాభావంతో కరువు పరిస్థితులు, తీవ్ర వడగాడ్పులు వంటివి సంభవిస్తుండడంతో వాతావరణ, పర్యావరణ నిపుణులు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నైరుతి సీజన్‌లో వర్షాలు ఆలస్యమై ఖరీఫ్ సాగుపై తీవ్ర ప్రభావం పడడంతో దిగుబడులు తగ్గుతుందన్న నిపుణుల హెచ్చరికల నేపథ్యంలోనే.. దేశంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లలో మార్పులు సంభవించాయని ఒక అధ్యయనం వెల్లడించింది. భారత వాతావరణ శాఖ నుంచి తీసుకున్న అంశాలపై స్వతంత్ర అధ్యయన సంస్థ 'ది కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ) 1982 నుంచి 2022 వరకు నిర్వహించిన ఈ అధ్యయనంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. గడచిన దశాబ్ద కాలంలో (2012-2022) ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 5,650 తాలూకాలకుగాను 4,419 తాలూకాల్లో (55 శాతం) 10 శాతం వర్షపాతం పెరగగా 11 శాతం తాలూకాల్లో వర్షపాతం తగ్గింది. ముఖ్యంగా గత దశాబ్ద కాలంలో రుతుపవనాల కదలికలు, వాటి ప్రభావంలో అనేక మార్పులు వచ్చాయని గుర్తించారు. దేశంలో జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తాయి. జూన్‌లో కేరళను తాకే నైరుతి రుతుపవనాల వల్ల కురిసే వర్షాలతో దేశంలో ఎండల నుంచి ఉపశమనం పొందడమే కాకుండా ఖరీఫ్ పంటల సాగుకు దోహదపడతాయి. ఈశాన్య రుతుపవనాలు దక్షిణ ద్వీపకల్పంలో రబీ పంటలతోపాటు తాగునీటి అవసరాలను తీరుస్తుంటాయి. క్లైమేట్ చేంజ్ వల్ల దేశంలో రుతుపవనాల మౌలిక స్వరూపంలో అనేక మార్పులు వచ్చాయని ఈ అధ్యయనం వెల్లడించింది. గడచిన 40 సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాల వర్షపాతం వివరాలను విశ్లేషిస్తే.. 29 ఏళ్లపాటు సాధారణంగా, తొమ్మిది సంవత్సరాలు సాధారణం కంటే ఎక్కువగా, మూడు సంవత్సరాలు తక్కువగా వర్షపాతం నమోదైంది. సంప్రదాయంగా తక్కువ వర్షపాతం నమోదయ్యే రాజస్థాన్, గుజరాత్, మధ్య మహారాష్ట్ర, తదితర ప్రాంతాల్లో వర్షాలు పెరిగాయి. తమిళనాడులో 1981 నుంచి 2011 వరకు సాధారణం కంటే 30 శాతం ఎక్కువగా వర్షపాతం నమోదైంది. దేశంలో 55 శాతం తాలూకాల్లో వర్షపాతం శాతం పెరగడం, వరదలు సంభవించడం జరిగాయి. గత పదేళ్లలో 64 శాతం తాలూకాల్లో సగటున ఒకటి నుంచి 15 రోజులు అధిక వర్షాలు కురిశాయి. ఉదాహరణకు గత ఏడాది హిమాచలప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ, 2022లో బెంగళూరులో సంభవించిన వరదలే ఇందుకు తార్కాణమని అధ్యయనంలో తేలింది. కాగా అత్యధిక వర్షాలు కురిసే అస్సోం, మేఘాలయల్లో వర్షపాతం తక్కువగా నమోదైంది. దేశానికి ధాన్యాగారంగా పేరొందిన గంగా మైదాన ప్రాంతం ప్రధానంగా పశ్చిమబెంగాల్ పరిసర ప్రాంతాల్లో నైరుతి సీజన్‌లో వర్షాలు గణనీయంగా తగ్గుతున్నాయి. ఈ ప్రాంతంలో జూన్, జూలై నెలల్లోనే ఖరీఫ్ పంటలను సాగు చేస్తుంటారు. అయితే ఈ రెండు నెలల్లో వర్షాలు ఆలస్యం కావడంతో ఖరీఫ్ సాగులో జాప్యం ఏర్పడంతోపాటు పంటల దిగుబడి గణనీయంగా తగ్గింది. ఇది దేశంలో పంటల దిగుబడి అంచనాపై ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో ఆకస్మిక వరదలు లేదా వర్షాభావంతో కరువు పరిస్థితులు ఎక్కువగా సంభవిస్తున్నాయి. జూన్, జూలైలో వర్షాలు ఆలస్యం కావడంతో గంగా మైదాన ప్రాంతమే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఖరీఫ్ సాగు ఆలస్యమవుతోంది. ఇక అక్టోబరులో దేశంలో 48 శాతం తాలూకాల్లో 10 శాతానికిపైగా వర్షపాతం పెరగడంతో ఖరీఫ్‌లో చేతికి వచ్చిన పంటలు నష్టపోతుండడం, రబీ సాగు ఆలస్యం కావడం వంటివి జరుగుతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. గత పదేళ్లలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడులో 80 శాతం, ఆగ్నేయ తెలంగాణలో 44 శాతం, ఏపీలోని మూడు జిల్లాల్లో 39 శాతం వర్షపాతం పెరిగింది. ఇంకా ఒడిశా, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, గోవాలో కూడా వర్షపాతం పెరిగిందని ఈ అధ్యయనం వెల్లడించింది.



చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



మాధవస్వామి, నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జనవరి 21: ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని మంగళగిరిలో జరుగుతున్న మహాసభల సందర్భంగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుగిడె మాధవస్వామి, ప్రధాన కార్యదర్శిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు, కోశాధికారిగా బత్తూరి మోహన్‌రావును ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కడుపు కన్నయ్య, నీలూరి లక్ష్మయ్య, బి.వెంకట నారాయణ, జొన్నాదుల భారతి, సహాయ కార్యదర్శులుగా పామిశెట్టి గోవిందు, గొట్టుముక్కల బాలాజీ, పీ.హరి, వై.పీతాంబరధరరావు, మరో 35 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నికైనట్టు చేనేత కార్మిక సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి జింకా చలపతి ప్రకటించారు.

ధర్మారం క్యాంపుపై మేమే దాడి చేశాం

▸▸ మావోయిస్టు నాయకురాలు సమత పేరుతో లేఖ

చర్ల, జనవరి 21: బీజాపూర్ జిల్లా పామేడులోని ధర్మారం సీఆర్పీఎఫ్ క్యాంపుపై తామే దాడి చేశామని మావోయిస్టులు ప్రకటించారు. ఈ మేరకు దక్షిణ సబ్-జోనల్ బ్యూరో ప్రతినిధి సమత పేరుతో ఆదివారం ఓ లేఖ విడుదలైంది. ఈ ఘటనపై ఇంతవరకు పోలీసులు మాట్లాడేందుకు నిరాకరించినా.. మావోయిస్టులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. "ఈ నెల 16న ధర్మారం క్యాంపుపై భారీ దాడి చేశాం. పీఎల్‌జీఏ బలగాలు వీరోచితంగా పోరాటం చేశాయి. ఈ పోరులో చాలా మంది పోలీసులు మృతిచెంది ఉంటారు. పలువురు క్షతగాత్రులై ఉంటారు. వారంతా పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చి సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, డీఆర్జీ, బస్తర్ ఫైటర్స్ వంటి విభాగాల్లో చేరి, ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చనిపోయిన పోలీసుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాం" అని సమత ఆ లేఖలో పేర్కొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ పోరాటంలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని వివరించారు. మృతిచెందిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ కమాండర్ కరటం దేవాల్, మూసాక విక్రమ్, మడకం దేవాల్ ఉన్నారని వెల్లడించారు.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

అమరావతి అజరామరం

● 1496వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, జనవరి 21: దుర్మార్గపు మూడు ముక్కల ఆట ఆపేవరకు అమరావతి పోరు ఆగదని 33వేల ఎకరాలు రాజధానికి త్యాగం చేసిన రైతులు స్పష్టం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1496వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు, మహిళలు మాట్లాడుతూ సీఎం జగన్ అమరావతిని చంపేయాలని చూస్తున్నాడన్నారు. అమరావతి ఎప్పటికీ అజరామమేనన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా అమరావతి అభివృద్ధిని ఆపలేరన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటను ఆపాలన్నారు. అమరావతే ఎప్పటికీ ఆంధ్రుల రాజధాని అని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

దళిత జేఏసీ కన్వీనర్ మార్టిన్‌కు కన్నీటి వీడ్కోలు



దళిత జేఏసీ కన్వీనర్ మార్టిన్ శవపేటికను మోస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకర్

తుళ్లూరు జనవరి 21: అమరావతి దళిత పోరాట యోధుడు గడ్డం మార్టిన్ లూథర్ బాబుకు పలువురు ప్రముఖులు, జేఏసీ నేతలు, స్థానిక ప్రజానీకం కన్నీటి విడ్కోలు పలికారు. శనివారం ఓ ప్రైవేటు హాస్పటల్లో గుండెపోటుతో మార్టిన్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం మందడంలో అంత్యక్రియలు నిర్వహించారు. అమరావతి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మార్టిన్ మృతదేహాన్ని మాజీ మంత్రులు, దేవినేని ఉమా, నక్కా ఆనందబాబు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, అమరావతి దళిత బహుజన అధ్యక్షుడు పోతుల బాలకోటయ్య, అమరావతి దళిత జేఏసీ నేత పులి చిన్నా, దళిత బహుజన జేఏసీ అధ్యక్షుడు చిలకా బసవయ్యలు సందర్శించి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, రాజధాని అమరావతి ఐక్య కార్యచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకరరావు స్థానిక పలువురు టీడీపీ నేతలు మార్టిన్ శవపేటికను మోసారు. రైతు, దళిత జేఏసీ సభ్యులు, టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు అంతిమ యాత్రలో పాల్గొని మార్టిన్‌కు నివాళి అర్పించారు.

నారాయణాద్రికి రేక్ షేరింగ్ గ్రహణం

● అర్ధరాత్రి దాటాక గుంటూరు వస్తుండటంతో ప్రయాణీకుల పాట్లు

గుంటూరు, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ ప్రయాణీకులకు గుంటూరు రైల్వేస్టేషన్‌లోనే చుక్కలు చూపిస్తోంది. నిత్యం అర్ధరాత్రి దాటాక వస్తుండటంతో ప్రయాణీకులు నానా అవస్థలు పడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం దూర ప్రాంత రైలు అయిన ముంబై - సికింద్రాబాద్ దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో రేక్‌ని ముడిపెట్టి తరచుగా లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోనే గంటల తరబడి రీషెడ్యూల్ చేస్తోంది. దీంతో ఈ రైలులో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్న యాత్రీకులు సకాలంలో తిరుమల చేరుకోలేక అవస్థలు పడుతున్నారు. ఎప్పుడైతే సమయపట్టికని మార్పు చేసి రీషెడ్యూలింగ్ చేస్తున్నారో నరసపూర్, చెన్నై, డెల్టా, తిరుపతి నుంచి లింగంపల్లి వెళ్లే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు ఎదురొస్తుండటంతో క్రాసింగ్ సమస్యలు ఉత్పన్నమౌతున్నాయి. ఈ కారణంగా గుంటూరుకు అర్ధరాత్రి ఒంటి గంట దాటాక వస్తుంది. కొన్ని రోజులైతే అర్ధరాత్రి 2 గంటల సమయం దాటిపోతోంది. ఇక తెనాలి తర్వాత మెయిన్‌లైన్‌లోకి ప్రవేశించాక కూడా ఏవైనా రెగ్యులర్ రైళ్లు వస్తే నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని లూప్‌లైన్‌లోకి పెట్టి వాటికి ప్రిసిడెన్స్ ఇచ్చి పంపుతున్నారు. ఈ కారణంగా తిరుపతి వెళ్లేసరికి మరుసటి రోజు ఉదయం 8.30 గంటల సమయం దాటుతుంది. ఈ రైలు దిగి బస్సు ఎక్కి కొండ పైకి చేరుకొనేసరికి 10 గంటల సమయం అవుతుండటంతో ప్రయాణీకులు గదులు తీసుకొనేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కి దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో రేక్ షేరింగ్ తొలగించి పాత సమయపట్టిక ప్రకారం నడపాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్

చేనేతను కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యం

● సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

మంగళగిరి సిటీ, జనవరి 21: పాలకుల నిర్లక్ష్యానికి బలవుతున్న చేనేత పరిశ్రమను కాపాడుకునేందుకు పోరాటాలే శరణ్యమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మంగళగిరి తెనాలి రోడ్డులోని మార్కండేయ కల్యాణ మండపంలో జరుగుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర 13వ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభకు పి.గోవిందు, గొట్టుముక్కల లక్ష్మీ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు చేనేతకు శరాఘాతంగా మారాయన్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కట్టా హేమసుందరరావు మాట్లాడుతూ తరతరాలుగా చేనేత వృత్తినే నమ్ముకుని బతుకుతున్న నేత కార్మికులు ఉపాధి కోల్పోయి అర్ధాకలితో అలమటిస్తూ ఆకలిచావులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ చేనేత కేంద్రాల్లో చేనేత శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. చేనేత సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో జరగబోయే పోరాటాల్లో కార్మికులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేతివృత్తిదార్ల సంఘం ప్రధాన కార్యదర్శి కే.రామాంజనేయులు, సీపీఐ ఏరియా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మిక సంఘం మహాసభల్లో ప్రసంగిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

బండలాగుడు పోటీల్లో కొప్పురావూరు ఎడ్ల జతకు ప్రథమం



ప్రథమస్థానంలో నిలిచిన ఎడ్లజత

దుర్గి, జనవరి 21: మండల కేంద్రమైన దుర్గిలో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం నాలుగుపళ్ల ఎడ్ల బండలాగుడు పోటీలు జరిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీలో గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లజత 4,801 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలిచింది. తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామానికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత 4,759 అడుగులతో రెండోస్థానం, కడప జిల్లా బ్రహ్మంగారి మఠం కేశవాపురానికి చెందిన శీలం జగన్‌మోహన్‌రెడ్డి ఎడ్లజత 4,502 అడుగులతో మూడోస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వైకుంఠాపురానికి చెందిన కేశం హుస్సేన్ ఎడ్లజత, నరసరావుపేట మండలం ఇంకుర్తికి చెందిన మాదనబోయిన పోతురాజు యాదవ్ యడ్లజత నాలుగైదు బహుమతులను సంయుక్తంగా పంచుకున్నాయి. గురజాలకు చెందిన జత ఆరోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, బండ్ల ప్రసాద్‌లు వ్యవహరించారు. కటకం రామారావు, గంధె గోపాలరావులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సునీతసాయిశంకర్, ఉన్నం పెద్దబ్బాయి, యూత్ నేత యకటీల బుచ్చిబాబు, కటకం చిన వెంకటయ్య, ఊరిబిండి మన్నెయ్య, కొత్తా వెంకటేశ్వర్లు, కటకం శ్రీనివాసరావు, తోట మూర్తి, ఉన్నం చిన్నబ్బాయి, హుస్సేన్, శ్రీనివాసరావు, తోటకూర నాగేశ్వరరావు, సర్పంచ్ మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



కుంకలగుంటలో మాట్లాడుతున్న టీడీపీ సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ, పక్కన బాజీ చౌదరి

సంఘ సంస్కర్త పేరు పక్కన జగన్ పేరా?

● కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జనవరి 21: అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన సీఎం జగన్ సంఘ సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పక్కన దోపిడీ దారుడైన జగన్ పేరు పెట్టుకోవటం ఎంత వరకు సమంజసమని సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. ఆదివారం పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కుంకలగుంటలో ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు తీవ్ర ద్రోహం చేశారని ఆరోపించారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరుతో ఇస్తున్న పథకానికి ఆయన పేరు తొలగించి జగనన్న విద్యా పథకం అని పేరు పెట్టడం అంబేద్కర్‌ను అవమానించటమేనన్నారు. సంఘ సంస్కర్త ఐన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని మోదీ ఢిల్లీలో ఏర్పాటు చేశారని, ఎక్కడా ఆయన ఇలా పేరు పెట్టుకోవటానికి తాపత్రయ పడ లేదన్నారు. ఆయనతో పాటు ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, 20 ఆర్థిక సూత్రాల అమలు కమిటీ మాజీ చైర్మన్ యాళ్ల శ్రీనివాస శేషశాయిబాబు, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, జవ్వాజి మల్లిఖార్జునరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, తెలుగు రైతు సంఘం నేత గార్లపాటి వెంకటేశ్వర్లు, మాలపాటి మహంకాళిరావు, కనుమూరి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలో ముగిసిన క్రీడోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఏపీ ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి

పెదకాకాని, జనవరి 21: ఆడుదాం ఆంధ్రలో భాగంగా ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ, ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న ఏపీఎస్పీఎఫ్ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్-2024 ఆదివారంతో ముగిసింది. అందులో భాగంగా 100 మంది ఏపీఎస్పీఎఫ్ సిబ్బంది రెండు రోజులపాటు వాలీబాల్ మరియు షటిల్ బ్యాడ్మింటన్‌లో పాల్గొని తమ సత్తా చాటారు. ముగింపు కార్యక్రమంలో ఏపీఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి, డైరెక్టర్ రవి ప్రకాష్‌రెడ్డి, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ, ఏపీఎస్పీఎఫ్ విజయవాడ జోనల్ కమాండెంట్ ఎం.శంకరరావు చేతుల మీదుగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు ట్రోఫీలను బహూకరించారు. అసిస్టెంట్ కమాండెంట్లు కె.కృష్ణమూర్తి, బి.శ్రీనివాసరావు, ఎంకేవీఎస్ గుప్తా, ఎస్.శ్రీనివాసరావు, పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు, టి.కృష్ణమాచారి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యం

● 25 నుంచి దశల వారీ ఆందోళనలు

● రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



గుంటూరు(విద్య), జనవరి 21: ప్రభుత్వం పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందని, ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 25 నుంచి దశలవారీ ఆందోళనలు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తాలుకా ఆవరణలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా 70, 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పెన్షన్ తగ్గించడం శోచనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఈనెల 25న తాలుకా కేంద్రాల్లో, 29న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. విజయవాడలో ఫిబ్రవరి 5న రాష్ట్రస్థాయి ధర్నా చేపడుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు కె.దాలినాయుడు, వివిధ జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభుదాసు, కోశాధికారి టీవీఎస్ఎస్ఆర్‌పీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి ఎమ్మెల్యే ఆళ్ల



ఆళ్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న షర్మిల

మంగళగిరి సిటీ, జనవరి 21: మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆళ్ల మంగళగిరి నుంచి వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. రెండుమార్లు గెలిచినా మంత్రి పదవి దక్కకపోవడం, మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం వంటి కారణాలతోపాటు వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరపున టిక్కెట్టు లేదన్న ప్రచారం నేపథ్యంలో ఆయన ఆయన గతేడాది డిసెంబరులో తన ఎమ్మెల్యే పదవికి స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా సమర్పించారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్న వార్తలతో తాను కూడా షర్మిల వెంటే నడుస్తానని ప్రకటించారు. దీనిలో భాగంగా ఆదివారం విజయవాడలో ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా షర్మిల ప్రమాణస్వీకారం చేశారు. ఇదే వేదికపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి షర్మిల కాంగ్రెస్ కండువాను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఎంసీహెచ్ బ్లాక్ నిర్మాణానికి రూ.2 కోట్ల విరాళం

● చెక్ అందజేసిన డాక్టర్ గోపాలరావు



రూ.2 కోట్ల చెక్ అందజేస్తున్న డాక్టర్ గోపాలరావు, బీనా

గుంటూరు (మెడికల్), జనవరి 21: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చేపట్టిన మాతా శిశు సంక్షేమ కేంద్రం (ఎంసీహెచ్ బ్లాక్) నిర్మాణానికి గుంటూరు వైద్య కళాశాల 1964 బ్యాచ్ పూర్వవిద్యార్థి డాక్టర్ తాతినేని గోపాలరావు(హైదరాబాద్) వ్యక్తిగతంగా రూ.2కోట్ల విరాళం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందు లో భాగంగా ఆదివారం డాక్టర్ గోపాలరావు, డాక్టర్ బీనా దంపతులు గుంటూరు వచ్చి తాము ప్రకటించిన విరాళంలో కొంత మొత్తాన్ని చెక్ రూపంలో జింకానా కోఆర్డినేటర్ డాక్టర్ బి.బాలభాస్కరరావుకు అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలో అందజేస్తామని తెలిపారు. గుంటూరు ప్రభుత్వాస్పత్రి మాజీ సూపరింటెండెంట్, దివంగత డాక్టర్ నూతక్కి వెంకటేశ్వరరావుకు, గోపాలరావు అల్లుడు. డాక్టర్ నూతక్కి పేరిట ఎంసీహెచ్ బ్లాక్‌కు అల్లుడు గోపాలరావు, కుమార్తె బీనా ఈ విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ బీ చంద్రశేఖరరెడ్డి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్ పరిధిలో.. 13 మంది సీఐల బదిలీ

గుంటూరు, జనవరి 21: గుంటూరు రేంజ్‌లో 13 మంది సీఐలను బదిలీ చేస్తూ ఐజీ పాలరాజు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కొద్ది నెలల్లో రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అధికార వైసీపీ నేతల సిఫార్సులు, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఆయా బదిలీల ప్రక్రియ నిర్వహిస్తున్నారు. కొద్ది నెలల క్రితమే నగరంపాలెం సీఐగా నియమితులైన మల్లికార్జునరావును తాజాగా నరసరావుపేట రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. రేంజ్ పరిధిలో బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి... తెనాలి రూరల్ సర్కిల్‌లో పని చేస్తున్న కె.శ్రీనివాసరెడ్డి స్పెషల్ బ్రాంచ్ బాపట్లకు, బాపట్ల డీటీసీలో పనిచేస్తున్న ఈ.మాల కొండయ్యను గుంటూరు రేంజి వీఆర్‌కు, అదేవిధంగా చిలకలూరిపేట టౌన్ సీఐ సి.సీతారామయ్య గుంటూరు రేంజ్ వీఆర్‌కు, ఎస్.విజయ్ చంద్రను రేంజ్ వీఆర్ నుంచి చిలకలూరిపేట టౌన్‌కు, నగరంపాలెం సీఐ కె.మల్లికార్జునరావును నరసరావుపేట రూరల్ సర్కిల్‌కు, తాడేపల్లి సీఐ ఎ.మల్లికార్జునరావును రేపల్లె రూరల్ సర్కిల్‌కు, కె.వీరాస్వామిని పెదకూరపాడు సర్కిల్ నుంచి పెదకాకానికి, బి.సురేష్ బాబును పెదకాకాని నుంచి రేంజ్ వీఆర్, గుంటూరుకు బదిలీ చేశారు. ఏ సుధాకర్‌ను రేంజ్ వీఆర్, గుంటూరు నుంచి తెనాలి 2వ టౌన్‌కు, ఎస్.వెంకటరావును తెనాలి 2వ టౌన్ నుంచి రేంజ్ వీఆర్‌కు, ఏవీ శివప్రసాద్‌ను కంట్రోల్ రూమ్, గుంటూరు నుంచి వీఆర్‌కు, వి.సూర్యనారాయణను దిశా బాపట్ల నుంచి సైబర్ సెల్, ప్రకాశానికి, పసుపులేటి రామకృష్ణను ఎస్సీ ఎస్టీ సెల్, బాపట్ల నుంచి వేమూరు సర్కిల్‌కు బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెదకాకాని, జనవరి 21: పెదకాకాని సమీపంలోని హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్టు ఆదివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. గుంటూరు పొత్తూరివారితోటకు చెందిన షేక్ బాబర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై భార్య షేక్ రజియా(37), కూతురుతో విజయవాడ వెళుతున్నాడు. మార్గమధ్యలోని కంతేరు అడ్డరోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడ్డారు. లారీ తన భార్య తలపైగా వెళ్లినట్టు, అక్కడికక్కడే ఆమె మృతి చెందినట్టు బాబర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

సత్తెనపల్లి, జనవరి 21: భర్త వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని 30వ వార్డు వావిలాల ఘాట్ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆ వార్డులో నివశిస్తున్న మాటూరి మరియదాసు, అతని భార్య మరియమ్మను డబ్బులు ఇవ్వమని వేధిస్తున్నాడు. ఈ విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ జరిగిన అనంతరం మరియదాసు ఇంట్లో నుంచి బయటకు వెళ్ళాడు. అతను తిరిగి రాత్రి ఇంటికి వచ్చే సరికే ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మరియమ్మ(45) చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైసీపీలో రచ్చకెక్కిన వర్గపోరు

● పార్టీ కార్యాలయ ప్రారంభానికి ఒక వర్గం దూరం

● బలసాని ఎదుటే బాహాబాహీ

కాకుమాను, జనవరి 21: వైసీపీలో వర్గపోరు రచ్చకెక్కింది. మండల కేంద్రమైన కాకుమానులో వైసీపీ పార్టీ కార్యాలయాన్ని వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ ఆదివారం రాత్రి ప్రారంభించారు. తొలుత గ్రామంలో ర్యాలీ జరిగింది. ఈ క్రమంలో వైసీపీలో ఒక వర్గం యువకులు మరో వర్గం యువకులపై దాడికి దిగారు. అక్కడే ట్రాక్టర్‌పై ఉన్న వైసీపీ ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ వారిస్తున్నా యువకుడిపై పిడిగుద్దులు గుద్ది భౌతికదాడి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాటి నుంచి మండలంలో వైసీపీ రెండుగా చీలిపోయింది. నల్లమోతు శివరామకృష్ణకు చెందిన వర్గం ఒక వైపు, ఆయనకు వ్యతిరేకంగా మరో వర్గం ఉంది. ఎమ్మెల్యే సుచరిత ఒక వర్గం నాయకులకు కొమ్ము కాయడంతో ఒక వర్గం వారు సుచరితకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే ఇటీవల సుచరితను తాడికొండ సమన్వయ కర్తగా నియమించినప్పటి నుంచి మండలంలో రెండు వర్గాలు పోటాపోటీగా నూతన సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్‌ను కలసి పరిస్థితులను వివరించారు. అయితే నల్లమోతుకు వ్యతిరేక వర్గం వారు మండలంలో పార్టీ కార్యాలయ ప్రారంభానికి రావాలని కోరినా కిరణ్‌కుమార్ రాకపోవడంతో పాటు తాజాగా ఆదివారం నల్లమోతు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యాలయ ప్రారంభానికి రావడంతో మరో వర్గం వారు దూరం అయ్యారు.

బలసాని కిరణ్‌కుమార్ తొలిసారి కాకుమానుకు రావడంతో బాణా సంచా పేలుళ్ళ, తీన్‌మార్ వాయిద్యాలతో పాటు యువకులు బైకులకు సైలెన్సర్ లేకుండా అతి వేగంతో భారీ శబ్దాలు చేసుకుంటూ స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేశారు. వచ్చిన వారికి మాంసాహారం పెట్టారు. వారంతా వైష్ణాలయంలోని అరుగులపై కూర్చొని తినడం స్థానికులను ఆశ్చర్యానికి గురి చేసింది.



ట్రాక్టర్‌పై నుంచే సర్ది చెబుతున్న నల్లమోతు శివరామకృష్ణ. పక్కనే ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119, 130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



పున్నారెడ్డిని పరామర్శిస్తున్న జీవీ ఆంజనేయులు తదితరులు

మీ ఆశయం త్వరలోనే నెరవేరబోతోంది

● మాజీ ఎమ్మెల్యే పున్నారెడ్డితో జీవీ

వెల్దుర్తి, జనవరి 21 : ఆనాడు ఎమ్మెల్యేగా ఉండి ఈ ప్రాంత సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి వరికపూడిశెల ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయించారు.. త్వరలోనే మీ ఆశయం నెరవేరబోతోందని మాజీ ఎమ్మెల్యే పున్నారెడ్డితో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం వరికపూడిశెల ప్రాజెక్ట్ ప్రాంతాన్ని సందర్శించిన జీవీ ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డిలు శిరిగిరిపాడులోని పున్నారెడ్డి గృహానికి చేరుకొని ఆయన్ను పరామర్శించారు. వరికపూడిశెల ప్రాజెక్ట్ పూర్తయితే ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని పున్నారెడ్డి అన్నారు. స్పందించిన జీవీ మాట్లాడుతూ రానున్నది టీడీపీ ప్రభుత్వమేనని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని, యేళ్ల తరబడి ఎదురుచూస్తున్న మీ కోరికతోపాటు రైతుల ఆకాంక్షను నెరవేర్చే రోజు దగ్గర్లోనే ఉందని అన్నారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట టీడీపీ నేతలు ఉన్నారు.

విశ్వకర్మ గాయత్రీ కార్పెంటర్ వర్కర్స్ నూతన కమిటీ నియామకం

పిడుగురాళ్ల, జనవరి 21 : పిడుగురాళ్ల పట్టణ విశ్వకర్మ గాయత్రి కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా షేక్ ముస్తఫా, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వీరభద్రాచారి, దూదేకుల ఖాశిం, కోశాధికారిగా షేక్ తహసిద్దీన్‌లు నియమితులయ్యారు. ముఖ్యఅతిధులుగా రాష్ట్ర కార్పెంటర్స్ యూనియన్ నాయకులు షంషేర్ అలీ, సయ్యద్ అమీర్ అలి, పల్నాడు జిల్లా సీపీఎం నాయకులు ఏపూరి గోపాలరావు, షేక్ ఖాదర్‌వలి, జనసేన నాయకులు దూదేకుల ఖాశింసైదా పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పిడుగురాళ్ల, జనవరి 21 : ప్రతి ఒక్కరు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ రాంకిషన్ గోనుగుంట్ల తెలిపారు. ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో పిడుగురాళ్ల రోటరీ క్లబ్, శేషాద్రి సూపర్ స్పెషాలిటీ క్యాన్సర్ ఆసుపత్రి నరసరావుపేట ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వ్యాధి పరీక్షలు, అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి వ్యాధికి ప్రస్తుతం అన్నిరకాల చికిత్సలు ఉన్నాయని డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారు 155 మందికిపైగా ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నవ్య, పమిడి యశ్వంత్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆత్మకూరి గురవయ్య, జూలకంటి సుబ్రహ్మణ్యం, రోటరీ క్లబ్ సభ్యులు పంగులూరి విష్ణుబాబు, వడ్డవల్లి సాంబశివరావు, కొత్త రవి, జోకా బ్రహ్మం, సయ్యద్ అమీర్‌అలి, పసుమర్తి సుబ్రహ్మణ్యం, జుజ్జూరి మురళీ, వంకాయల గోపి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బెదిరిన ఎడ్లు.. తృటిలో తప్పిన ప్రమాదం

● ఎమ్మెల్యే పీఆర్కేతో సహా పలువురికి స్వల్ప గాయాలు



బెదిరి ప్రజలపైకి వెళుతున్న ఎడ్లు

దుర్గి, జనవరి 21: దుర్గిలో ఉన్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన ఎండ్ల బండలాగుడు పోటీల్లో అపశృతి చోటుచేసుకుంది. ఎండ్ల బండలాగుడు పోటీల్లో మొదటి రోజు పోటీలను ప్రారంభించేందుకు ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసన సభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విచ్చేశారు. పూజా కార్యక్రమం నిర్వహించే లోపులోనే ఎడ్లు బెదిరి జనంలోకి దూసుకెళ్లాయి. ఎమ్మెల్యే పీఆర్కేతోపాటు పలువురు వైసీపీ నేతలు కిందపడిపోయారు. పక్కన ఉన్న నేతలు వారందరిని పక్కకు లాగారు. ఎడ్లు వేరే వైపునకు వెళ్లాయి. ఎమ్మెల్యేతోపాటు నేతలు స్వల్ప గాయాలతో బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కల్యాణ మండపం శ్లాబ్ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే పీఆర్కే



ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, జనవరి 21: పట్టణంలోని శ్రీనగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం పనులను ఆదివారం ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పరిశీలించారు. అనంతరం శ్లాబ్ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

గోలి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

రెంటచింతల, జనవరి 21 : గోలి గ్రామ సమీపంలోని గోలి వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారుల ఆమోదానికి పంపినట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పీఆర్కే చెప్పారు. ఆదివారం గోలి గ్రామంలో ఓ వేడుకలో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెట్టిపాలెం గ్రామం నుంచి మల్లవరం వరకు మిగిలిన రహదారి నిర్మించే నిమిత్తం తుఫాన్ అత్యవసర పథకం కింద రూ.35 లక్షలు విడుదలయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో పురంశెట్టి సత్యనారాయణ, గురవయ్య, సర్పంచ్ చంద్రం, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి, గోలి వాసు, నాగేశ్వరరావు, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, చల్లా మట్టారెడ్డి, గొట్టం భాస్కరరెడ్డి, వైసీపీ యూత్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, గుండా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మద్దు మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

మాచవరం, జనవరి 21 : మండలంలోని మోర్జంపాడుకి చెందిన మాజీ సర్పంచ్ మద్దు వెంకటేశ్వర్లు (66) అనారోగ్య కారణాలతో ఆదివారం మృతి చెందారు. ఈయన గతంలో మోర్జంపాడు సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన మృతికి గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తిలు మోర్జంపాడుకి చేరుకొని మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. అదేవిధంగా వైసీపీ మండల నాయకులు వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పించారు.

నియామక పత్రాల అందజేత

సత్తెనపల్లి, జనవరి 21 : సత్తెనపల్లి మండలంలో జనసేన పార్టీ నూతన కార్యవర్గానికి నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు ఆదివారం నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో నాదెండ్ల నాగేశ్వరరావు, కొమ్మిశెట్టి సాంబశివరావు, రంగిశెట్టి సుమన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

రామమందిరంలో పూజలు

పిడుగురాళ్ల, జనవరి 21: అయోధ్య రామమందిరం ప్రతిష్ఠ సందర్భంగా ఆదివారం కొండమోడు సమీపంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి సత్సంగం భక్తుల ఆధ్వర్యంలో రామనామ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో భవనాశి నరసింహారావు, వివి నాగేశ్వరరావుతో పాటు పలువురు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల పట్టణంలోని 2వ వార్డు పరిధిలో శ్రీరామ భక్తులు ఆదివారం రాములవారి చిత్రపటం, వస్త్రాలు, జెండాలతో ఊరేగింపు నిర్వహించారు. అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠ పురస్కరించుకొని ప్రతి ఒక్కరు సోమవారం రామాలయాల్లో రామ భజన, సంకీర్తనలతో గడపాలని కోరారు.

తెలుగుదేశంలోనే బీసీలకు సముచిత స్థానం

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 21 : తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో శనివారం ముప్పాళ్ళ, సత్తెనపల్లి పట్టణ జయహో బీసీ సమావేశం జరిగింది. సమావేశానికి టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాతా జయప్రకాశ్ నారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని బీసీలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. బీసీ నాయకులను చంపిన ఘనత జగన్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాష్ట్రాన్ని జగన్ నుంచి కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. జగన్ పోవాలని.. చంద్రబాబు రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జగన్ సీఎం అయ్యాక భూముల విలువలు తగ్గాయని, తెలుగుదేశం అధికారంలోకి వస్తుందని తెలిశాక భూముల విలువలు పెరుగుతున్నాయన్నారు. జనసేన, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయం అన్నారు. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి కన్నా నివాళులర్పించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బీసీ రాష్ట్ర నేతలు గుంటుపల్లి నాగేశ్వరరావు, తాడిబోయిన చంద్రశేఖర్ యాదవ్, మున్నా రాంబాబు, మదికదరాల గంగాధర్‌లు మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వస్తేనే బీసీల అభివృద్ధి సాధ్యం అన్నారు. ఈ సమావేశంలో నాయకులు యెలినేడి రామస్వామి, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, తొరటి వెంకటరావు, తుమ్మల ఏడుకొండలు, పత్తిపాటి హరేకృష్ణ, మార్కెట్ రాజు, మామిడి వెంకటేశ్వరరావు, రాఘవా యాదవ్, పూజల వెంకటకోటయ్య, ఆరేపల్లి ఏడుకొండలు, నూర్ బాషా జానీ బాబు, బత్తుల వెంకట స్వామి, మారెళ్ళ స్వామి, కటకం రామకృష్ణ, జోరిగే శ్రీనివాసరావు, సత్తెనపల్లి, ముప్పాళ్ళ మండలాలకు చెందిన పలువురు టీడీపీ బీసీ నేతలు పాల్గొన్నారు.

వైద్య శిబిరం నిర్వహించిన బాజీ చౌదరికి అభినందనలు

● నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు, జనవరి 21 : గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి అభినందనీయుడని సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నకరికల్లు మండలం కుంకలగుంట గ్రామంలో ఎన్‌జీఎస్ స్వచ్ఛంద సంస్థ, కాటూరి మెడికల్ కళాశాల హాస్పటల్ సంయుక్తంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ బీపీ, షుగర్ వంటి పరీక్షలు ఉచితంగా చేయించుకోవటం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కలుగుతుందని, అలాంటి సేవకు బాజీ చౌదరి శ్రీకారం చుట్టడం పార్టీపరంగా మంచి కార్యక్రమం అని అన్నారు. ఆధునిక వైద్య పరికరాలతో పాటు నైపుణ్యం గల వైద్యుల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించటం తనకు ఎంతో సంతృప్తి కలిగించిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, జవ్వాజి మల్లికార్జునరావు, యాళ్ళ శేష శ్రీనివాస సాయి బాబు, నాదెండ్ల సత్యనారాయణ, గోపు శ్రీనివాసరావు, దేరాల గోవిందరాజులు, మాలపాటి మహంకాళిరావు, గార్లపాటి వెంకటేశ్వర్లు, కొల్లి హరి ప్రసాదు, ముప్పా నాగేశ్వరరావు, రోశయ్య, రామయ్య, చిన్న తదితరులు పాల్గొన్నారు. మొదట కుంకలగుంట మెయిన్ సెంటర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి కన్నా లక్ష్మీనారాయణ, బాజీ చౌదరిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వయం ఉపాధిపై ఆధార పడి జీవించే వారి కోసం కనుమూరి బాజీ చౌదరి ఆర్థిక సహాయంతో తోపుడు బండ్లను కన్నా చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

అత్యంత ధనిక సీఎం కావాలన్నదే జగన్ ధ్యేయం : కన్నా

రాజుపాలెం, జనవరి 21 : దేశంలో అత్యంత ధనిక ముఖ్యమంత్రి కావాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ధ్యేయమని, రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని కోటనెమలిపురి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుల, మత, ప్రాంతంతో సంబంధం లేకుండా అందరూ చంద్రబాబుకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షులు తోట నర్సయ్య, జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మాజీ ఎంపీపీ నర్రా బాబురావు, గుత్తా వెంకట్రావు, పార్లమెంటు కమిటీ కార్యదర్శి అంకాళ్ల ప్రభుదాసు, వర్ల శ్రీను, నియోజకవర్గ నాయకులు చిన్నబోయిన రాఘవ యాదవ్, వాసా వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు శనగపూల వెంకయ్య, పగడాల శ్రీను, నాయకులు సానికొమ్ము కోటిరెడ్డి, గంగవరపు రామలక్ష్మణరావు, గడేమ వెంకట్రావు, కోట జోసఫ్, వేపూరి రామయ్య, కణదం వెంకట్రావు, లేబాకుల బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తలపై పెరిగిన దాడులు

ముప్పాళ్ళ జనవరి 21 : ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కార్యకర్తలపై దాడులు పెరిగి పోయాయని సత్తెనపల్లి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని మాదల బీసీ కాలనీలో మూడురోజుల క్రితం జరిగిన ఇరువర్గాల ఘర్షణ లో గాయపడి సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్త బండారు నాగేశ్వరరావును శనివారం రాత్రి పరామర్శించారు. వైసీపీ ఆరాచకాలకు భయపడవద్దని ఎటువంటి సమస్య వచ్చినా పార్టీ అండగా ఉంటుందని హామీఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

నేడు బీసీ మండల సదస్సు

అచ్చంపేట, జనవరి 21 : అచ్చంపేటలో మండల బీసీ సదస్సును నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం ఆదివారం తెలిపారు. షిరిడీ సాయి బాబా కళ్యాణ మండపంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ బీసీ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ హాజరవుతారన్నారు. బీసీలంతా సదస్సుకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జనసేన పార్టీ కోసం కష్టపడి పని చేయాలి : నాదెండ్ల

సత్తెనపల్లి రూరల్, జనవరి 21 : పార్టీ కోసం జన సైనికులు నిత్యం కష్టపడి పని చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నాదెండ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల పార్టీ సమన్వయ సమావేశం ఆదివారం రాత్రి దూళిపాళ్ళలో జరిగింది. ఈ సందర్భంగా మండల కమిటీ నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అప్పారావు అందజేశారు. పార్టీ పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపి పార్టీ బలోపేతానికి ఎలా కృషి చేయాలో సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సాంబశివరావు, 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్, జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ సభ్యులు బత్తుల కేశవ, నకరికల్లు మండల అధ్యక్షురాలు లక్ష్మీ, ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు సిరిగిరి పవన్ కుమార్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

27న యరపతినేని ఆధ్వర్యాన మెగా జాబ్‌మేళా

గురజాలటౌన్, జనవరి 21 : నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు సుమారు 50 కంపెనీలతో గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఈనెల 27వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారు. పట్టణంలోని వాగ్దేవి ఫార్మసీ కళాశాలలో ఈ మేళా జరపనున్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9347009386, 9347860852, 9030111694ను సంప్రదించాలన్నారు.



తాలూకా సెంటర్‌లో సమ్మె చేస్తున్న అంగన్ వాడీలు

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

సత్తెనపల్లి, జనవరి 21 : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో తాలూకా సెంటర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న సమ్మె ఆదివారానికి 41వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలను అడుగడుగునా ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెపుతామని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మాను వెనక్కి తీసుకోవాలన్నారు. ఒక పక్క అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతుండగా మరో పక్క విధుల్లో చేరకపోతే కొత్త వారిని నియమిస్తామని ఐసీడీఎస్ అధికారులు చెపుతున్నారు. తాము అడ్డదారిలో ఉద్యోగాల్లో చేరలేదని, కలెక్టర్లు తమను నియమించారని, అవసరమైతే తాడో పేడో న్యాయ స్థానంలో తేల్చుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విధుల్లో చేరేది లేదని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు అన్నారు. అంగన్‌వాడీలకు సీఐటీయూ, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటిస్తున్నారు.

● పిడుగురాళ్ల, జనవరి 21: పిడుగురాళ్లలో అంగన్‌వాడీల ధర్నా కొనసాగింది. న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు 40వ రోజు ఆదివారం కూడా తమ నిరసన పిడుగురాళ్లలో కొనసాగించారు.

ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న ప్రభుత్వం

సత్తెనపల్లి, జనవరి 21 : వైసీపీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోతుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల ఆదినారాయణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొక్కా సంగీతరావు ఆదివారం పేర్కొన్నారు. వైసీపీ నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు వైదొలగటం ఇందుకు నిదర్శనమన్నారు. వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో టీడీపీలో చేరుతున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో ముఖ్యమంత్రి జగన్ విఫలమయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పటం ఖాయమన్నారు.

ఘనంగా లెనిన్ శత వర్ధంతి


క్రోసూరు, జనవరి 21 : లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం క్రోసూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గ సిద్ధాంతాన్ని మార్క్స్ యంగిల్స్ రూపొందిస్తే దానిని అమలు చేసిన ఘనత మహోన్నత వ్యక్తి అయిన లెనిన్‌దేనన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఆవుల ఆంజనేయులు, తిమ్మిశెట్టి హనుమంతరావు, గర్నెపూడి మహేష్, గంటెల చిన్నప్ప పాల్గొన్నారు.

25న మహిళలకు సాంస్కృతిక పోటీలు

క్రోసూరు, జనవరి 21 : రిపబ్లిక్‌డే సందర్భంగా ఈనెల 25న పెదకూరపాడు నియో జకవర్గ స్థాయిలో క్రోసూరులో మహిళలకు సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్టు శిఖా శ్యామ్‌సన్ తెలిపారు. దేశభక్తి పాటల పోటీలు, డ్యాన్స్ పోటీలు నిర్వహిస్తామ న్నారు. నిమ్మకాయ స్పూన్, నడక పోటీలు కూడా ఉంటాయన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు ఉండదని, పాల్గొనదలచిన వారు ఈనెల 24వ తేదీ సాయంత్రం లోగా 9849066412 నెంబరులో సంప్రదించాలన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతు లతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా ఇవ్వబడతాయన్నారు.

సమాజ హితమే పడుచూరి అభిమతం

● మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ



పడుచూరి వెంకటేశ్వర్లు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

అమరావతి, జనవరి 21 : సమాజ హితమే తన అభిమతంగా ప్రజల అభిమానాన్ని చురగొన్న వ్యక్తి పడుచూరి వెంకటేశ్వర్లు అని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడి గా, గుంటూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా, అమరావతి వాసవీ సత్రం వ్యవస్థాపక అధ్యక్షుడిగా పని చేసి కొన్ని నెలల క్రితం మృతి చెందిన పడుచూరి వెంకటేశ్వర్లు కాంస్య విగ్రహాన్ని ఆదివారం కన్నా ఆవిష్కరించారు. అమరావతిలోని వాసవీ సత్రంలో ఏర్పాటు చేసిన విగ్రహావిష్కరణ అనంతరం కన్నా ప్రసంగించారు. తన సొంత వ్యాపారాలకన్నా సమాజ సేవ పరమావధిగా ఆధ్యాత్మిక, రాజకీయ, సేవా రంగాలలో ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమానికి వాసవీ సత్రం అధ్యక్షుడు చలువాది మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. కార్యక్ర మంలో పడుచూరి కుటుంబ సభ్యులతో పాటు శ్రీశైలం వాసవీ సత్రం అధ్యక్షుడు డి.వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య ప్రముఖులు ఎల్ఎస్ఆర్ ఆంజనేయులు, టి.రాంబాబు, ఎం.ఉమామల్లేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎల్.మోహనభా స్కర్, ఎంఆర్‌కె మూర్తి, సుబ్రమణ్యం, ఎం.రంగనాధం, ఏ.సాంబశివరావు, ఎం.సూర్యవేణుగోపాలరావు, కె.వెంకటే శ్వర్లు, ఎల్.సాంబశివరావు, ఏల్చూరి వెంకటేశ్వర్లు, పులిపా టి వెంకటప్రసాద్, ఆతుకూరి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ నిమ్మా విజయసాగరబాబు, తాళ్ల వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొని పడుచూరికి నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపితేనే రాష్ట్రాభివృద్ధి

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

అమరావతి, జనవరి 21 : రాష్ట్రంలో అభివృద్ధి, ఉపాధి జరగాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడమే లక్ష్యంగా ప్రజలు రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేనకు మద్దతు తెలపాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నరుకుళ్లపాడులో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాసిరకం మద్యం సరఫరా చేసి పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, విద్యుత్ చార్జీలు పెంచారని, సాగునీరు అందుబాటులో లేదని అన్నారు. దళితులపై దాడులు, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు మినహా ప్రభుత్వం సాధించింది ఏమిలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం, కుటుంబంలో చదువుకునే పిల్లలకు రూ.15 వేలు ఆర్థికసాయం అందించడం జరుగుతుందన్నారు. అంతేగాక పోలవరం, రాజధాని అమరావతి పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత మంచినీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి కొమ్మాలపాటి సంతాపం

అమరావతి, జనవరి 21 : మండల పరిధిలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకుడు చింకా మాధవరావు మృతి చెందారు. ఆయన మృతదేహానికి పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీధర్‌తో పాటు టీడీపీ నాయకులు ఎం.విష్ణు, కె.వసంతరావు, బి.వెంకటేశ్వరరావు, షేక్ బాబు, వీరబాబు, శౌరయ్య, కంచేటి సాయిబాబు, నాగేంద్ర తదితరులు నివాళులర్పించారు.

బ్రిటీషు పాలన కొనసాగిస్తున్న వైఎస్ జగన్

సత్తెనపల్లి, జనవరి 21 : జగన్ జైలు నుంచి బ్రిటీషు పరిపాలన చదువుకొని బయటకు వచ్చాడని టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 19, 20, 21వ వార్డులకు చెందిన పది మంది వైసీపీ కార్యకర్తలు పట్టణ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ భారత దేశంలో అత్యంత ధనికుడు కావాలనే లక్ష్యంతో సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర సంపదను దోచుకుంటున్నారన్నారు. సైకో జగన్ పాలనను రాష్ట్ర ప్రజలంతా తరిమి కొట్టాలన్నారు. పార్టీలో చేరిన వారిలో తోట నాగేంద్ర బాబు, రంగా రామారావు, మామిడి ఏడుకొండలు, సీహెచ్ ప్రసన్న కుమార్, పసుపులేటి రాంబాబు, పసుపులేటి రాము, పాపిశెట్టి అజయ్, పసుపులేటి మల్లేశ్వరరావు, కూరపాటి దినేష్, కారంశెట్టి కోటేశ్వరరావు, మామిడి రామకృష్ణ, ఆర్.సాంబశివరావు తదితరులు ఉన్నారు. సభలో టీడీపీ రాష్ట్ర నాయకులు ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, నాయకులు ఆతుకూరి నాగేశ్వరరావు, కటకం రామకృష్ణ, నూర్ బాషా జానీ బాబు, పోట్ల ఆంజనేయులు, మార్కెట్ రాజు, గుంటూరు ఆశీర్వాదం, కంభాల వెంకటేశ్వర్లు, వక్కంటి అజయ్, జయరామ్, కొండలు, రాంబో బుడే, నామాల పుష్పలత, మారెళ్ళ మల్లేశ్వరరావు, జానీ ఖాజావలి, జోరిగే శ్రీను ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

సత్తెనపల్లి, జనవరి 21 : పట్టణంలోని 21వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ తిరుమల శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు ఎక్కల సుబ్బారావు ఆధ్వర్యంలో 13 మంది వైసీపీ కార్యకర్తలు ఆ పార్టీని వీడి శనివారం సాయంత్రం కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పట్టణంలోని 27వ వార్డుకు చెందిన టీడీపీ నేత రాంబో బుడే ఆధ్వర్యంలో 11 మంది వైసీపీ కార్యకర్తలు కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బాబు, ఫారుఖ్, ఇంతియాజ్, మున్నా, నాగూర్, సుబాని, కరిముల్లా, మీరావలి, ఫారుఖ్, జిలానీ, బాజి ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు యెలినేడి రామస్వామి, నాయకులు కటకం రామకృష్ణ, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్‌బాషా జానీబాబు, రాంబోబుడే, ఎక్కల సుబ్బారావు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలోని 8వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ, బీఎస్పీకి చెందిన దళిత యువకులు శనివారం రాత్రి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారిలో దర్శి రవి కుమార్, గుజ్జర్లపూడి రోజీబాబు, గుజ్జర్లపూడి కోటేశ్వరరావు, గుజ్జర్లపూడి సుధాకర్, గుజ్జర్లపూడి నాగరాజు, గుజ్జర్లపూడి నాగేశ్వరరావు, గద్దల ఆదాం, ఎల్ నల్లమ్మ, ఎల్ పిచ్చయ్యలు ఉన్నారు. కాగా 6వ వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్తలు చల్లా నాగ, ధూపగుంట్ల జానకి రామారావు, సర్వేపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.

ఉచిత రక్త పరీక్షల శిబిరం

టీడీపీ బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 19వ వార్డులో ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని ఆదివారం టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉచిత శిబిరాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల పంపిణీ



సిమెంట్ బెంచీలను పరిశీలిస్తున్న గాదె వెంటేశ్వరరావు

క్రోసూరు, జనవరి 21 : పెదకూరపాడు నియోజకవర్గంలో జనసేన పార్టీ తయారు చేయించి న సిమెంట్ బెంచీల పంపిణీని ఆదివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ప్రారంభించారు. బెల్లంకొండలోని ఆర్ఆర్ సెంటర్‌లో ఈ బెంచీలను తయారు చేయించినట్టు నియోజకవర్గ అధికార ప్రతినిధి డీ.అనంతనా యుడు తెలిపారు. మండలానికి 20 చొప్పున మొత్తం వంద సిమెంట్ బెం చీలను పంపిణీ చేయనున్నట్టు ఆయ న చెప్పారు. ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించటం ఖాయమన్నారు. పెదకూరపాడు నియోజక వర్గంలో కూటమి జెండా ఎగుర వేయటం ఖాయమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేడు మల్లాది వెంకన్న తిరునాళ్ల

అమరావతి, జనవరి 21 : మండల పరిధిలోని మల్లాది గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల సోమవారం జరుగుతుందని ఆలయ ట్రస్టీ ఏలూరి మంగాయమ్మ తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకుని స్వామివారికి ఉదయం పంచామృతాలతో స్నపన, ప్రత్యేక అలంకారం, శాంతి కల్యాణం జరుగుతాయి. పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాల పాటి శ్రీధర్ సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందని చెప్పారు.

ఉచిత ఫిజియోథెరపీ సేవలు

అమరావతి, జనవరి 21 : అమరావతిలో అమ్మ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉచిత క్యాంప్ నిర్వహించి రోగులకు థెరపీ సేవలు అందించారు. క్యాంప్‌ను ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎన్.శ్రీధర్‌చంద్ ప్రారంభించారు. 30 మంది రోగులకు సేవలు అందించినట్లు నిర్వాహకులు డాక్టర్ అల్లాభక్షు తెలిపారు.

వరికపూడిశెలపై బీజేపీకి మాత్రమే చిత్తశుద్ధి

మాచర్ల రూరల్, జనవరి 21 : వరికపూడిశెల ప్రాజెక్ట్‌పై కేవలం బీజేపీకి మాత్రమే చిత్తశుద్ధి ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మడి కోటేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వరికపూడిశెల నిర్మాణంపై తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేస్తామని చెప్పిన దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో ప్రజలకు వివరించాలన్నారు. ఆయన వెంట బీజేపీ మాచర్ల అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య, పట్టణ అధ్యక్షుడు ఓర్సు క్రాంతి కుమార్, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

షర్మిల సభకు తరలివెళ్లిన కాంగ్రెస్ నేతలు

రెంటచింతల, జనవరి 21 : పీసీసీ(ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి) అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడుతున్న వైఎస్ షర్మిల విజయవాడ వస్తున్న సందర్భంగా ఆదివారం భారీ వాహనాలతో కాంగ్రెస్ నేతలు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రామచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు రాగిడి ప్రతాప్‌బాబు, బత్తుల జాకబ్‌రాజు, పాశం కోటిరెడ్డి, పోట్ల చలమయ్య, కొమ్ము మునలయ్య, దొడ్డా శ్రీనివాసరావు, కర్నాటి కోటయ్య, చిమటా వెంకటేశ్వర్లు, గాదె పుల్లారెడ్డి, తూము శ్రీనివాసరావు తదితరులున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



శాంతినగర్ సమీపంలోని ఫాం హౌస్‌లో సమావేశమైన నరసరావుపేట వైసీపీ అసమ్మతి నేతలు

ఎమ్మెల్యే గోపిరెడ్డికి మేం సహకరించం

● నరసరావుపేట వైసీపీ అసమ్మతి నేతల అల్టిమేటం

నకరికల్లు, జనవరి 21: నరసరావుపేట నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిని అధిష్ఠానం మార్చాలని, ఇందుకు భిన్నంగా మొండిగా ముందుకు వెళితే తాము ఎన్నికల్లో సహకరించకపోగా వ్యతిరేకంగా పోరాటం చేస్తామని నరసరావుపేట వైసీపీ అసమ్మతి నేతలు అల్టిమేటం జారీ చేశారు. ఆదివారం రాత్రి నకరికల్లు మండలం శాంతినగర్ సమీపంలోని ఫాంహౌస్‌లో నరసరావుపేట వైసీపీ అసమ్మతి నేతలంతా సమావేశం అయ్యారు. సమావేశంలో అసమ్మతి నేతలు మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికల్లో నరసరావుపేట వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎట్టి పరిస్థితుల్లో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పోటీ చేయటాన్ని తాము అంగీకరించమని స్పష్టం చేశారు. అధిష్ఠానం ఈ విషయమై పునరాలోచించుకోవాలని అసమ్మతి నేతలు తేల్చిచెప్పారు. తాము వైసీపీ అధిష్ఠాన్ని కలసి గోపిరెడ్డి అభ్యర్థిత్వాన్ని తిరస్కరిస్తున్నామని చెపుతామన్నారు. కాదు, కూడదు అని గోపిరెడ్డినే అభ్యర్థిగా నిర్ణయిస్తే వ్యతిరేకంగా పని చేసేందుకు తాము వెనుకాడమన్నారు. సమావేశంలో బాపట్ల నియోజకవర్గ వైసీపీ పరిశీలకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, నరసరావుపేట మాజీ మునిసిపల్ కౌన్సిలర్లు చల్లా శ్రీనివాసరావు, నేలటూరి మురళి, నరసరావుపేట మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్, వైసీపీ పట్టణ అధ్యక్షుడు హనీఫ్, రొంపిచర్ల జడ్పీటీసీ పిల్లి ఓబులరెడ్డి, పలువురు వైసీపీ ముఖ్య నేతలు ఈ అసమ్మతి సమావేశంలో పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం ఉప్పలపాడు హైస్కూలులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

దాతల సాయం అభినందనీయం

● ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఉప్పలపాడు (నరసరావుపేట రూరల్), జనవరి 21: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన సాగిరెడ్డి కోటిరెడ్డి- కోటి నాగమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు డాక్టర్ పురుషోత్తం బాబురెడ్డి-భారతి దంపతులు, డాక్టర్ నాగిరెడ్డి రాజేంద్రబాబురెడ్డి- కిరణ్మయి దంపతుల సహకారంతో ఉప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూలులో రూ.10లక్షల రూపాయల నిధులతో పాఠశాలలో అభివృద్ధిచేసిన గ్రిల్స్, పార్కింగ్ షెడ్, ప్రారంభోత్సవ కార్యక్రమంలో నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉప్పలపాడు గ్రామానికి చెందిన సాగిరెడ్డి బ్రదర్స్ తన చిన్ననాటి మిత్రులన్నారు. వృత్తి రీత్యా ఇతర దేశాలలో స్థిరపడినప్పటికీ వారి స్వగ్రామమైన ఉప్పలపాడు, నరసరావుపేటకు పలుమార్లు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఇటీవల నరసరావుపేట పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు రూ.30లక్షల వ్యయంతో 6 డయాలసిస్ యూనిట్లు అందించడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో రిటైర్డ్ ఐఎఫ్ఎస్ కేరళ ప్రసాద్, ఎంపీపీ మూరమోయిన సుబ్బాయమ్మ శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యులు పి.చిట్టిబాబు, వైస్ ఎంపిపి వెంకటప్పారెడ్డి, వైసీపీ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

నరసరావుపేట లీగల్, జనవరి 21: పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఓ 60 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు నరసరావుపేట రైల్వే ఎస్ఐ టీ సుబ్బారావు ఆదివారం రాత్రి తెలిపారు. మృతుడు తెల్లలాల్చీ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని శవాగారానికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

230మందికి కంటి వైద్యపరీక్షలు

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 21: పెదకాకాని శంకర్ ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని వేల్పూరు పాత శివాలయం వద్ద గోపు శ్రీరాములు, కాకాని నాగేంద్రం, శ్రీనివాసరావుల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్యశిబిరంలో శంకర్ ఆసుపత్రి డాక్టర్లు రుతుజ, సీత, యోగేష్‌లు పాల్గొని 230మంది రోగులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. వారిలో కంటి శుక్లాలున్న 51మందిని ఆపరేషన్‌లు పెదకాకానిలోని శంకర్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యశిబిరం నిర్వాహకుడు కాకాని అంజిబాబును పలువురు గ్రామస్థులు అభినందించారు. వైద్యశిబిరం నిర్వహణకు గ్రామపెద్దలు బొల్లా బ్రహ్మానందం, బోయపాటి రామాంజనేయులు, సంద్రపాటి చలపతిరావు, పారా చౌదరి, మల్లేశ్వరరావు, రమేష్, శ్రీనివాసరావు, ఏడుకొండలు తమవంతు సహకారమందించారు.

బలహీనవర్గాల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

● డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, జనవరి 21: బడుగు బలహీనవర్గాల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామానికి చెందిన 50కుటుంబాల వారు వైసీపీ నుంచి డాక్టర్ చదలవాడ అరవిందబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర డాక్టర్స్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకుడు బొడపాటి పేరయ్య, కొల్లి వెంకటేశ్వర్లు, కూరపాటి శ్రీనివాసరావు, మద్దు తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పమిడిపాడులో శ్రీరామచంద్ర స్వామి పట్టాభిషేక మహోత్సవం

పమిడిపాడు (నరసరావుపేట రూరల్), జనవరి 21: మండలంలోని పమిడిపాడు గ్రామంలోని శ్రీవల్లభరాజస్వామి దేవస్థానంలో శ్రీరామచంద్రస్వామి పట్టాభిషేకం మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో పమిడిపాడు గ్రామంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి పట్టాభిషేకం మహోత్సవాన్ని తిలకించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి నరసరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి సయ్యద్ జిలాని కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుక్కెడు నీటికోసం బొల్లాపల్లి వాసుల విలవిల

● అంతంత మాత్రం వర్షాలతో అడుగంటిన బోర్లు
● పొలాల్లోని మోటార్ల వద్దకు నీటికోసం పరుగు
● ట్యాంకర్ల అరకొర ఏర్పాటుతో నీటికోసం ఇక్కట్లు
● చలికాలంలోనే ఇలా ఉంటే ఎండాకాలంలో పరిస్థితిపై మండలవాసుల్లో ఆందోళన



నీటి కోసం ఎదురు చూస్తున్న గండిగనుమల వాసులు



మన్నెపల్లి తండాలో వాటర్ ట్యాంక్ వద్ద నీటి కోసం గుమికూడిన గిరిజనులు

బొల్లాపల్లి, జనవరి 21: పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలోని రేమిడిచర్ల, గుమ్మనంపాడు, మన్నెపల్లి తండా, గుంగుపల్లితండా, గండి గనుముల, దోమలగుండం గ్రామాల్లో గుక్కెడు నీటికోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ ఏడాది అంతంత మాత్రంగానే వర్షాలు ఉండటంతో బోర్లలో నీరు అడుగంటాయి. దీంతో నీరురాక పొలాల్లోని మోటార్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వం అడపాదడపా ఒకటి రెండు గ్రామాల్లో మాత్రమే ట్యాంకర్లు ఏర్పాటుచేసినా వాటివల్ల ఉపయోగంలేకుండా పోయిందని ఆటు గ్రామస్థులు, గిరిజనులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొర పెట్టుకున్నా తమ బాధలను పట్టించుకొనే నాధుడే లేడని, చుక్కనీరు ఇవ్వలేని పాలకుల బడాయి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఒకపక్క గతంలో ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లో నీటి సరఫరా చేసిన ట్యాంకర్లకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని, అధికారుల వద్ద నాయకులు మొర పెట్టుకుంటున్నారు. ఈ ఏడాది ఎండా కాలంకు ముందే నీటి ఎద్దడి ఏర్పడటంపై మండల వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు గ్రామాల్లో ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధంచేసి నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

2024లో టీడీపీని అధికారంలోకి తీసుకొద్దాం

● కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణలో నేతల సమష్టి ప్రతిజ్ఞ



అన్నవరంలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న అరవిందబాబు, శివరామకృష్ణ, కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రాము తదితరులు

రొంపిచర్ల, జనవరి 21: మండలంలోని అన్నవరంలో మాజీ శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నరసరావుపేట నుంచి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ర్యాలీగా అన్నవరం చేరుకున్నారు. ర్యాలీలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన టీడీపీ నాయకులకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శివప్రసాదరావు విగ్రహాన్ని డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ కోడెల శివరామకృష్ణ, డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, నల్లపాటి రాము, గోనుగుంట్ల కోటేశ్వరరావులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ డాక్టర్ కోడెల ప్రతి ఒక్కరి గుండెల్లో నిలిచి ఉన్నారని తెలిపారు. నరసరావుపేట అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. నల్లపాటి రాము మాట్లాడుతూ నరసరావుపేట నడిబొడ్డున శివప్రసాదు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ రొంపిచర్ల మండలంలో కోడెల శివప్రసాదరావు అభివృద్ధి చేశారని తెలిపారు. వైసీపీని తరిమికొట్టాలని పేర్కొన్నారు. కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో శివప్రసాదు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవటం సంతోషంగా ఉందన్నారు. ఆయన తనకు గురువులాంటి వాడని పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించాలన్నారు. కోడెల శివరామకృష్ణ మాట్లాడుతూ మండలంలో అన్నవరం తెలుగుదేశం పార్టీ నాయకులు ముందుకు వచ్చి విగ్రహాన్ని ఏర్పాటు చేయటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. కోడెల పల్నాటి పులిగా చిరస్థాయిగా నిలిచి పోయారన్నారు. కోడెల అంటే ధైర్యం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ఆయన తరిమికొట్టారన్నారు. నరసరావుపేట నియోజకవర్గంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధికి కోడెల శివప్రసాదు సహకరించారన్నారు. అన్నవరం గ్రామాన్ని తాను మరచిపోనని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు.

కార్యక్రమంలో కడియాల లలితసాగర్, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, కుమ్మెత కోటిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, చిరుమామిళ్ళ బ్రహ్మయ్య, కొలికొండ కొండలు, లింగా వెంకటేశ్వర్లు, శాఖమూరి రామ్మూర్తి, ఇంటూరి ప్రసాదు, కొక్కిరాల శ్రీనివాసరావు, అన్నవరం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు తదితరులు

సీపీఎస్ రద్దుపై అన్ని పార్టీల వైఖరి తెలియజేయాలి

● యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్

నరసరావుపేట టౌన్, జనవరి 21: ఉద్యోగులు పెన్షన్ విషయంపై అన్ని రాజకీయపార్టీలు తమ వైఖరి తెలియజేయాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేటలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల రాష్ట్ర కౌన్సిలర్ల సమావేశం జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 28న పాతపెన్షన్ సాధన సభ రాజమండ్రిలో జరుగుతుందన్నారు. ఈ సభకు అన్ని రాజకీయపార్టీల నాయకత్వాన్ని ఆహ్వానించామని, ఈ సభలో పాత పెన్షన్ అమలుకు తమ వైఖరిని ఆయా పార్టీలు స్పష్టంచేయాలని కోరామన్నారు. ఎవరైతే ఈ రాష్ట్రంలో సీపీఎస్ రద్దుచేసి లక్షలాది ఉద్యోగుల, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ అమలుచేస్తారో వారికే ఉద్యోగుల మద్దతు ఇవ్వదలచామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ ఈ నెల 24న జిల్లా కేంద్రం నరసరావుపేటలో బకాయిల సాధనకోసం ఉపాధ్యాయులతో బహిరంగ ప్రదర్శన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షుడు పి.ప్రేమకుమార్ మాట్లాడుతూ ఈ నెల 31నుంచి ఫిబ్రవరి 3వ తేదీవరకు నరసరావుపేటలో రిలే నిరాహారదీక్షలు చేస్తామన్నారు. సమావేశంలో కోశాధికారి జె.వాల్యానాయక్, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షుడు ఎం.మోహనరావు, ఏ భాగేశ్వరదేవి, జిల్లా కార్యదర్శులు కె.తిరపతిస్వామి, ఎం.రవిబాబు, చిన్నం శ్రీనివాసరావు, ఆర్ ఆజయ్‌కుమార్, ఏ నాసరరెడ్డి, కే ఉషాశేరిరాణి, ఆంగోతు శ్రీనివాసరావు,కే ప్రకాశరావు, ఎస్కే జిలాని, కిషోర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.సుందరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాండురంగవరప్రసాదరావు తదితరులు

అస్తవ్యస్త విధానాలతో పాఠశాల విద్య నిర్వీర్యం

● ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాండురంగవరప్రసాదరావు

నరసరావుపేట టౌన్, జనవరి 21: ప్రభుత్వం చేపట్టిన అస్తవ్యస్త విద్యారంగ వ్యతిరేక విధానాలతో పాఠశాల విద్య నిర్వీర్యం అవుతోందని, దీనికి కారణమైన 117, 128 జీవోలను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ పూర్వరాష్ట్రప్రధాన కార్యదర్శి పీ పాండురంగవరప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆదివారం నరసరావుపేటలోని పాతచెక్‌పోస్టు సెంటర్లోని టైనీటాట్ పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పీ పాండురంగవరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యారంగాన్ని ఒక ప్రయోగశాలగా మార్చిందన్నారు. ప్రాథమికస్థాయి విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగం లేని 3వ తరగతిలో టోఫెల్ శిక్షణ, బోర్డుపైన చూసి రాత పరీక్షా విధానం, మాతృభాష నేర్వకపోయినా విదేశీ భాషలు అంటూ హడావుడితో తరగతి గదిలో తీవ్ర గందరగోళ పరిస్థితులు సృష్టించారని అన్నారు. ప్రాథమిక పాఠశాలల తరగతుల విలీనంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఏడాది 36 వేలమంది విద్యార్థులు, రాష్ట్రంలో 4లక్షలపైన విద్యార్థులు చదువుకు దూరమయ్యారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై వ్యవహరిస్తున్నతీరుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలతో కలిసి ఉపాధ్యాయులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో షేక్ సుభాని, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్, రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, శ్రీనివాసరావు, కృష్ణారావు, షరీఫ్, దాసు, కరిముల్లా, ప్రధాన కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థికసాయం

నరసరావుపేట టౌన్, జనవరి 21: నరసరావుపేట పట్టణంలో ఎన్‌జీవో కాలనీలో ఉన్న బొల్లు రాజేశ్వరి కృష్ణారావు చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం పేద విద్యార్థికి ఆర్థికసాయం అందజేశారు. ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న గుంటూరు జిల్లా ప్రతిపాడు మండలం యనమదలకు చెందని దూపాటి వరుణ్‌సాయికుమార్‌కు రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాకులు, సినీ నటుడు బొల్లు వెంకటకృష్ణారావు, ట్రస్ట్ సభ్యులు బొల్లు వెంకటేశ్వర్లు, మర్లపాటి రామకృష్ణ, జాస్తి గోపాలకృష్ణబాబు, బీవీఎల్ వరప్రసాదు, రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



రామనామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వినుకొండలో రామనామ సంకీర్తన కార్యక్రమం

వినుకొండటౌన్, జనవరి 21: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా వినుకొండ విశ్వహిందూపరిషత్, చిన్నజీయర్‌స్వామి ఆశ్రమం, శంకరమఠం, పోలేరమ్మ గుడి, రంగనాయస్వామి దేవస్థానానికి చెందిన 500భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పట్టణంలో రామనామ సంకీర్తన కార్యక్రమాన్ని ఆదివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. చిన్నపిల్లలు, మహిళల కోలాటాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అయోధ్య రామాలయ ప్రతిష్ఠ సందర్భంగా పుట్టాబత్తుని ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యక్షప్రచారం ఉంటుందని, అన్ని రామాలయాల వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సనిశెట్టి అప్పారావు, గుడిపాటి బాలరావు, కన్నెగండ్ల అనంతరామకోటేశ్వరరావు, కోట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అయోధ్యలోని బాలరాముని ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి ఆలయంలో కోలాట, భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కట్టా సుబ్బారావు, పలువురు పాల్గొన్నారు.

లెనిన్‌కు ఘన నివాళి

శావల్యాపురం, జనవరి 21: కార్మికులు, కర్షకుల అభ్యున్నతి కోసం కార్మికవర్గాన్ని స్థాపించి కామ్రేడ్ లెనిన్ సేవలు చిరస్మరణీయమని సీపీఎం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో లెనిన్ శతవర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఎం నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముంద్రు వెంకట్రావు, భువనగిరి వెంకటేశ్వర్లు, ఎం.జెన్నెమ్మ, పి.శ్రీనివాసరావు, ముంద్రు రామాంజనేయులు, శివాది హనుమంతరావు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● వినుకొండ: ధనికులు, పేదలు అని వ్యత్యాసాలు లేని కులమత వర్గ రహిత సమాజ స్థాపనకోసం పాటుపడి శ్రామిక జనసామ్రాజ్యాన్ని స్థాపించిన మహోన్నత వ్యక్తి లెనిన్ అని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతివరప్రసాద్ అన్నారు. లెనిన్ 100వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, బూదాల సాగర్, పవన్, ఓర్సు శ్రీకాంత్, బత్తుల వెంకటేశ్వర్లు, జాన్, మల్లికార్జున, పోట్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామ సుబ్బాయమ్మ మాట్లాడుతూ ప్రపంచ విప్లవోద్యమ చుక్కాని లెనిన్ అన్నారు. కార్యక్రమంలో సీపీఐ దాని అనుబంధ సంఘాల నాయకులు పేలూరి రామారావు, లలిత కుమారి, లావు వీరేంద్ర, కే శివ కుమారి, వహీద తదితరులు పాల్గొన్నారు.

చెరువులో దిగి అంగన్‌వాడీల నిరసన



చెరువులో దిగి నిరసన తెలియజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వినుకొండ, జనవరి 21: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు 41వ రోజు మండలంలోని విఠంరాజుపల్లి గ్రామంలో గల చెరువులో వినూత్నరీతిలో నిరసన వ్యక్తం చేశారు. సుమారు 100మంది అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం చెరువులోకి దిగి ప్రభుత్వానికి దండం పెడుతూ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని వేడుకున్నారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు అంగన్‌వాడీలు మాట్లాడుతూ 22సంవత్సరాల సర్వీసులో ఇటువంటి నిరంకుశమైన ప్రభుత్వాన్ని చూడలేదని, ఏ ప్రభుత్వమైనా వారం, పదిరోజుల్లో రోడ్లపై ధర్నాలు, నిరసనలు చేపడితే పరిష్కార మార్గాలను చూపే ప్రభుత్వాలను చూశామని, ఈ ప్రభుత్వం ఎందుకు ఇంతమొండితనంగా వ్యవహరిస్తోందని నిలదీశారు. కార్యక్రమంలో బీబులు, కృష్ణకుమారి, హరిత, శ్రీదేవి, రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

రాష్ట్రానికి మేలు చేయని వైసీపీ ప్రభుత్వం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 21: ఐదు సంవత్సరాలు పాలించి రాష్ట్రానికి దమ్మిడీ కూడా మేలుచేయని ఏకైక ప్రభుత్వంగా రాష్ట్ర చరిత్రలో జగన్ ఏలుబడి మిగిలిపోనుందని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. ఇచ్చిన హామీలను మరచిపోయిన జగన్ కనీసం టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులను సైతం గాలికి వదిలివేసి రాష్ట్రాన్ని అభివృద్ధిలో దశాబ్దాలు వెనక్కి నెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక 32, 33, 34, 35వ వార్డుల్లో ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ ప్రచారంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్‌తో కలసి ప్రత్తిపాటి పాల్గొని మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజల ఉపాధికి తొలి ప్రాధాన్యం ఇస్తామని, ఐదు సంవత్సరాల్లో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తెలుగుదేశం మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలతో పాటు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, పెరిగిన విద్యుత్, ఆర్టీసీ రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంటి పన్నులు, పెట్రోల్, డీసిల్ గ్యాస్ ధరలు, ఇవేకాకుండా నిత్యావసర ధరలు పూర్తిగా పెంచి సామాన్యుడు బతకలేని పరిస్థితి కల్పించారని, వీటన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్ళాలని ప్రత్తిపాటి కార్యకర్తలకు దిశా, నిర్దేశం చేశారు. వీటన్నింటినీ తిరిగి గాడిలోకి పెట్టాలంటే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పించాలన్నా ఒక్క చంద్రబాబుకే సాధ్యమన్నారు.

టీడీపీ, జనసేన కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలి: నెల్లూరి

నాదెండ్ల, జనవరి 21: టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు వచ్చే ఎన్నికల్లో విజయం కోసం ఐకమత్యంగా పనిచేయాలని టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు అన్నారు. మండలంలోని గణపవరంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ విధానాలతో పరిశ్రమలు మూతపడి కార్మికులు బజారున పడ్డారన్నారు. మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ తేళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ వైసీపీ ఓడి పోతేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు ఎం.లక్ష్మీనారాయణ, పి.హనుమంతరావు, టి.శ్రీనివాసరావు, లీలాకృష్ణ, జాన్‌బాబు, కొండయ్య, గగారిన్, సుభానీ, లల్లు మాస్టర్, బాజీవలి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తి శ్రీనుకు న్యాయం చేయాలి

● నరసరావుపేట పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉదయశ్రీ

చిలకలూరిపేట అర్బన్, జనవరి 21: కోడి కత్తి శ్రీను కేసులో ఐదు సంవత్సరాలైనా జగన్ సాక్ష్యం చెప్పటానికి కోర్టుకు రాకపోవటానికి గల కారణం ఏమిటని? నరసరావుపేట పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఉదయశ్రీ ప్రశ్నించారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు మహిళలతో కలసి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జగన్ అధికారంలోకి రావటం కోసం తొలిమెట్టుగా తన చెల్లిని, రెండో మెట్టుగా కోడి కత్తి డ్రామాను, చివరిగా బాబాయి హత్య డ్రామాని రక్తికట్టించి అధికారంలోకి వచ్చాడన్నారు. అనంతరం తల్లిని, చెల్లిని రోడ్డున పడవేసిన జగన్‌కు కోడి కత్తి శ్రీను ఆవేదన అర్థం కాదన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కోడికత్తి శ్రీనుకు న్యాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెరీనా సుల్తానా, పోపూరి లక్ష్మి, రాయి పద్మ, వీరకుమారి పాల్గొన్నారు.

ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వినతి



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యమిత్ర నాయకులు

వినుకొండ, జనవరి 21: ఆరోగ్యశ్రీలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జేఏసీ ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఆంధ్రప్రదేశ్ దళిత, గిరిజన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి తెలిపారు. సమాన పనికి సమానవేతనం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వెయిటేజీ మార్కులు, పిక్చర్‌పాలసీ అమలు, మెడికల్ లీవ్ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు ఆయన తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కాకాని అప్పారావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ప్రత్యూష, కె.అరుణ్‌కుమార్, పారా మెడికల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మోటమర్రు నరసింహారావుకు సేవారత్న పురస్కారం



మోటమర్రు నరసింహారావును సన్మానించి అవార్డును ప్రదానం చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

వినుకొండ టౌన్, జనవరి 21: వాసవి సేవాసమితి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా వినుకొండ పట్టణానికి చెందిన మోటమర్రు నరసింహారావుకు సేవారత్న పురస్కారానికి ఎంపిక కావడంతో సిల్వర్ జూబ్లీ జిల్లా కమిటీ ఛైర్మన్ యిమ్మడిశెట్టి గోవర్ధనరావు, కోశాధికారి ఐ.వి.ఎల్.రామకృష్ణారావు వినుకొండలోని మోటమర్రు నరసింహారావు నివాసానికి వెళ్లి ఆదివారం దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో సేవా కార్యక్రమాల్లో 25 సంవత్సరాలుగా జిల్లా వ్యాప్తంగా 52మంది సేవాతత్పరులను గుర్తించి సేవారత్న పురస్కారాలు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా మోటమర్రు నరసింహారావును అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెనుగొండ శ్రీను, వాసవిక్లబ్ అధ్యక్షుడు చలంకూరి కోటేశ్వరరావు, విశ్వహిందూపరిషత్ అధ్యక్షుడు గజవల్లి నాగపవన్‌కుమార్, కాకుమాను కోటేశ్వరరావు, వినుకొండ రెడ్‌క్రాస్ ఛైర్మన్ బెల్లంకొండ ప్రసాద్, సుధీర్, పొత్తూరి రాము తదితరులు పాల్గొన్నారు.